నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్
శుక్రవారం | మార్చి 07, 2025 | www.navatelangana.com



మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

- పోరాటాల ద్వారానే మహిళల హక్కుల సాధన
- ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల

నవతెలంగాణ-కాశిబుగ్గ

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల పిలుపునిచ్చారు. గురువారం ఖిలా వరంగల్ పడమర కోటలో ఐద్వా ఖిలా వరంగల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఠాగూర్ భవాని అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సుకు రత్నమాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళలు ప్రపంచవ్యాప్తంగా పోరాడి తమ హక్కులను సాధించుకున్న రోజుగా జరపాలని కోరారు. శ్రామిక మహిళలు ఫ్యాక్టరీలలో 18గంటలు పనిచేసినా సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వలేదన్నారు. దీనిపై అనేక ఉద్యమాలు నిర్మించి రోజుకు 8గంటల పని, ఓటు హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, చదువుకునే హక్కు లాంటి అనేక హక్కులను మహిళలు సాధించుకున్నారన్నారు. నేటికీ అనేక ప్రాంతాలలో సమాన వేతనాలు అందడం లేదని, రాత్రి షిఫ్టులలో మహిళలు పని చేస్తూనే ఉన్నారని, శ్రమకు తగ్గ వేతనాలు పొందడం లేదని, కుటుంబానికి సరిపడా సరుకులు కొనుక్కునే స్థితిలో లేరన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రత్నమాల డిమాండ్ చేశారు. మార్చి 7న వరంగల్ స్టేషన్ రోడ్డు నుండి చౌరస్తా వరకు జరిగే ప్రదర్శనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ హక్కుల సాధన కోసం నినదించాలన్నారు. ఈకార్యక్రమంలో గండు పద్మ, కృష్ణవేణి, వజ్రమ్మ మాధవి, రమా, రాధిక, పరమేశ్వరి, లక్ష్మక్క, నిర్మల, విజయ, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీల కుటుంబాలను ఆదుకోవాలి

- మరణించిన కూలీ కుటుంబానికి రూ.20లక్షలు,
- గాయాలపాలైన రూ.5లక్షల ఎగ్రేషియా చెల్లించాలి

నవతెలంగాణ-నర్సంపేట



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యవసాయ కూలీ కుటుంబానికి రూ.20లక్షలు, గాయాలపాలైన వారికి మెరుగైన వైద్యంతో పాటు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబులు డిమాండ్ చేశారు. గురువారం చెన్నారావుపేట మండలంలోని జీడిగడ్డ తండలో జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న కూలీలను పరమార్శించారు. వైద్యం అందుతున్న తీరును అడిగి తెల్సుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడిగడ్డ తండాకు చెందిన 40 మంది కూలీలు ట్రాలీలో ఇటుకాలపెల్లి గ్రామానికి పనుల కోసం వస్తుండగా చోటుచేసుకున్న ప్రమాదంలో భూక్య సుక్య చనిపోగా మరో 15 మంది కూలీలకు బలమైన గాయాలపాలై ఆసుపత్రిలో చేరారని తెలిపారు. వెంటనే చనిపోయిన కూలీ కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని, గాయాలపాలైన కూలీలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. వారు కోల్కోవడానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని కూలీల బతుకులు గాలిలో దీపంలా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ అవసరాలను వెల్లదీసుకుంటున్న వ్యవసాయ కార్మిక కుటుంబాలకు రక్షణకై సమగ్రమైన చట్టాన్ని తీసుకరావాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నమిండ్ల స్వామి, రైతు సంఘం నాయకులు కొరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్, గొర్లు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, గట్ల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కూలీల కుటుంబాలకు ప్రభుత్వం అండ

నవతెలంగాణ-నర్సంపేట



గాయాలపాలైన కూలీల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పీసీసీ సభ్యులు పెండెం రామానంద్ తెలిపారు. గురువారం రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన కూలీలను ఆసుపత్రిలో పరమర్శించారు. మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని వైద్యులకు సూచించారు. రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి చెందడం బాధకరమన్నారు. 15 మంది కూలీలు గాయాలపాలు కాగా వారికి ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి బలమైన గాయాలపాలై ఎంజీఎంలో చేరిన కూలీల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూపరిండెంటెండ్‌తో మాట్లాడినారని తెలిపారు. మృతుడు భూక్య సూక్య కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు బత్తిని రాజేందర్, ఓటీసీ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎలగంటి విజయ్‌కుమార్, ఎర్ర యాకూబ్ రెడ్డి, అయూబ్, మసూద్‌భాయ్, బాబా, గాజుల రమేష్, పేరం బాబురావు, బీరం భరత్ రెడ్డి, బైరి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆజాంజాహి మిల్లు కార్మిక భవన స్థలం సర్వే

నవతెలంగాణ-కాశిబుగ్గ

ఆజంజాహి మిల్లు కార్మిక భవన స్థలాన్ని గురువారం అధికారులు మరోసారి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆజంజాహి మిల్లు భూముల పరిరక్షణ జేఏసీ నాయకులు మాట్లాడుతూ తాము రెండు రోజుల క్రితం వరంగల్ జిల్లా కలెక్టర్‌ను కలిసి మిల్లు కార్మిక భవన స్థలం విషయంలో మ్యుటేషన్ రద్దుచేసి, డిడి సర్వే చేయాలని వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఏడీ, డీఏ అధికారులు దేవరాజు, భుజంగరావు సర్వేయర్ సందీప్‌లు మరోసారి సర్వే చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు సర్వే అధికారులతో మాట్లాడుతూ కార్మికులకు అన్యాయం జరగకుండా నిజాలను నిర్భయంగా తెలుపాలని కోరారు. ఈకార్యక్రమంలో జేఏసీ నాయకులు గంగుల దయాకర్, అకేన వెంకటేశ్వర్లు, పెరుమళ్ళ లక్ష్మణ్, డాక్టర్ కొంఐతం కృష్ణ, ఇనుముల శ్రీనివాస్, ఆరెల్లి కృష్ణ, జన్ను రమేష్, కోమాకుల నాగరాజు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలి మహాసభకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

నవతెలంగాణ-వరంగల్



అఖిలభారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9 ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే పద్మశాలి మహా సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని గురువారం పద్మశాలి సంఘాల నాయకులు వారి నివాసంలో కలిసి ఆహ్వానించినారు. ఈసంద ర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి వస్తానని అన్నారు. ఈసందర్భంగా అఖిలభారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షులు గుండు ప్రభాకర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ నగర మేయర్, మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణి, తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మన్ ఈర పత్రి అనిల్ కుమార్, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు స్వామి, తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళి, అఖిలభారత పద్మశాలి సంఘం ఉపా ధ్యక్షులు గుండు ప్రభాకర్, సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథం, గూడూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల ఎదురుచూపును సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ కార్యక్రమం

నవతెలంగాణ-సంగెం



గత పాలకుల నిర్లక్ష్యంతో పేద ప్రజలు పదేళ్లగా సొంతింటి నిర్మాణానికి నోచుకోకుండా ఉన్న సందర్భంలో, మా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఎదురుచూపులను సాకారం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని షాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసి, భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .సొంతింటి కల సహకారం కోసం ప్రజలు పదేళ్లగా ఎదురు చూశారని, ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి, మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు. బడుగు, బలహీనవర్గాల ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇల్లు అని, వీటి పట్టాలు మహిళల పేరు మీదనే ఉంటాయనిన్నారు. పనులు జరుగుతున్న క్రమంలో నిధులు విడుదల చేయడం జరుగుతుందని త్వరగా పనులు పూర్తిచేయాలని లబ్దిదారులకు తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజురుచేస్తామని, ఇండ్ల కోసం ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరవుతాయన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు కందగట్ల నరహరి, గుమ్మడి హరిబాబు, మెట్టుపల్లి రమేష్, మడత కేశవులు, కిషోర్ యాదవ్, పాషా, మండల యూత్ అధ్యక్షులు గుగులోతు రమేష్ నాయక్, మాజీ జడ్పీటీసీ గుగులోతు వీరమ్మ, గృహ నిర్మాణ శాఖాధికారులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకేరు వాగు శాపం బీఆర్ఎస్, బిజెపీలదే..



- సొమ్మొకరిది సోకొకరిదిలా మాజీ మంత్రి పోకడలు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు
- ఎస్సారెస్పీ కెనాల్ సందర్శన..

నవతెలంగాణ-పర్వతగిరి/వర్ధన్నపేట:

ఆకేరు వాగు శాపం బీఆర్ఎస్, బిజెపి పార్టీలదేనని, సొమ్మొకరిది సోకొకరిదిలా మాజీ మంత్రి పోకడలు వున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం రోళ్లకల్లు గ్రామ ఆకేరు వాగు పరివాహక ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించేందుకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మండలంలోని కెనాల్ కాలువలను సందర్శించారు. ఈ సందర్శనలో ఉప్పరపల్లి గ్రామం నుండి కెనాల్ ద్వారా ఎల్ పాయింట్ నుండి రోళ్లకల్లు, రావూరు గ్రామాల మీదుగా ప్రవహించే ఆకేరు వాగులోకి సాగునీరు నిరంతరంగా అందేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. రైతులకు నీటి కొరత సమస్య తలెత్తకుండా ఉండేందుకు, ఎస్సారెస్పీ లేబర్తి, బొక్కల గూడెం గ్రామాలలో కాలువలకు సొంత ఖర్చుతో మిషన్ తెప్పించి కాలువలను శుభ్రపరిచి నీటి ప్రవాహాన్ని మెరుగుపరిచేలా చర్యలు చేపట్టారు. దీంతో, ఆయా ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు సమృద్ధిగా నీరు అందుతుందన్నారు. వర్ధన్నపేట కోనారెడ్డి చెరువుకు ఫీడర్ ఛానల్ ద్వారా వెళ్లే మార్గంలోన కాలువను శుభ్రం చేయించారు. ఎస్సారెస్పీ కెనాల్ కాలువలో కొన్ని ప్రాంతాల్లో మట్టి కట్టలు ఏర్పడటం వల్ల వర్ధన్నపేట నియోజకవర్గం వైపు నీటి ప్రవాహం సరిగ్గా జరగడం లేదని గుర్తించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు, సొంత ఖర్చుతో హిటాచి మెషిన్ ఏర్పాటు చేసి, ఆ మట్టికట్టలను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కృషితో, నీటి ప్రవాహం పునరుద్ధరించబడింది. రైతులకు సాగునీరు నిరాటంకంగా అందే పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే నాగరాజు కృషి వల్ల కాలువల ద్వారా నీరు నిరంతరాయంగా అందుతుందన్న ఆనందంతో, స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను అర్థం చేసుకుని, తక్షణ చర్యలు తీసుకున్నందుకు ఎమ్మెల్యేకి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతుల సంక్షేమానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నమ్మకముంటే ఏవృత్తిలోనైనా రాణించగలం..

- ఎలాంటి సమస్యలెదురుకాలే..
- డీఎస్‌డీవో ఎ.శ్రీలత

నవతెలంగాణ-వరంగల్‌ప్రాంతీయ ప్రతినిధి:



నమ్మకముంటే ఏ వృత్తిలోనైనా రాణించగలమని హన్మకొండ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎ.శ్రీలత స్పష్టం చేశారు. ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శ్రీలత 'నవ తెలంగాణ'తో మాట్లాడారు. సాంఘిక సంక్షేమ శాఖలో గత 20 ఏండ్లుగా పనిచేస్తూ నేడు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి స్థాయికి ఎదిగిన శ్రీలత వృత్తిలో ఎన్నడూ లింగ వివక్షను, వేధింపులను ఎదుర్కోలేదని వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి, ఇటీవల హన్మకొండ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిగా ఇన్‌ఛార్జ్ బాధ్యతలను స్వీకరించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేసినప్పుడే తనకు వృత్తి పట్ల సంతృప్తి అధికంగా వుండేదని తెలిపారు. జిల్లాలో 24 హాస్టల్స్ వున్నాయన్నారు. ఇందులో 15 ప్రీమెట్రిక్, 9 పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ వున్నట్లు తెలిపారు. సుమారు 2 వేల మంది విద్యార్థులు హాస్టళ్లలో విద్యనభ్యసిస్తున్నట్లు చెప్పారు. మహిళా అధికారిగా నా 20 ఏండ్ల అనుభవంలో ఏనాడు ఇబ్బంది పడలేదన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురు కాలేదని, గత 7-8 ఏండ్లుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఒకప్పుడు ఇంజనీరింగ్ శాఖలలో మహిళలుండేవారు కాదని, ఇప్పుడు మహిళలు ఎక్కువగా ఇంజనీరింగ్ సంబంధిత శాఖలలో ఎక్కువ మంది పనిచేస్తున్నారన్నారు. ఒకప్పటి లాగా మహిళలు లేరని, ఇప్పుడు ఏ ఉద్యోగాన్నయినా సవాల్‌గా తీసుకొని పనిచేస్తున్నారన్నారు. పోలీసు, ఆర్టీసీ తదితర శాఖల్లోనూ మహిళలు రాణిస్తున్నారన్నారు. తొలుత జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిగా ఇన్‌ఛార్జ్ తీసుకోవాలంటే కొంత జంకినా, ధైర్యంగానే పనిచేస్తున్నట్లు చెప్పారు. శాఖలో ఖాళీలు భర్తీ కాకపోవడం వల్ల పనిభారం పెరగడంతోపాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం కష్టతరంగా మారిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అన్ని రంగాల్లో మహిళలకు ప్రోత్సహం పెరిగిందని, అందుకే ఏ ఉద్యోగం వచ్చినా మహిళలు ఆఉద్యోగాల్లో రాణించడానికి కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు..

కూలీల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- ఆసుపత్రిలో వైద్య సేవలను అందించడంలో విఫలం
- ప్రమాద బాధితులను పరమార్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది

నవతెలంగాణ-నర్సంపేట



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యవసాయ కూలీ కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం చెన్నారావుపేట మండలం జీడిగడ్డ తండాకు చెందిన 40 మంది వ్యవసాయ కూలీలు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైయ్యారు. ఇందులో సూక్య అనే కూలీ మృతి చెందగా మరో ముగ్గురు తీవ్ర గాయాలు కాగా 36 మంది స్వల్పంగా గాయాలకు గురైయిన విషాద సంఘటన చోటుచేసుకొంది. నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన గాయాలపాలైన కూలీలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు పరమార్శించారు. వైద్యం అందుతున్న తీరును పరిశీంచి వైద్యులను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెల్సుకున్నారు.వెంటనే మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

- ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలను అందించడంలో విఫలం

మెడికల్ కాలేజి అనుబంధ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను పరమార్శించి తదుపరి పెద్ది మాట్లాడుతూ కిందటి కేసీఆర్ ప్రభుత్వంలో నర్సంపేట ప్రాంతవాసులకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జిల్లా ఆసుపత్రిని తీసుకొచ్చామన్నారు. వైద్యం అందుబాటులోకి తీసుకరావడంతో పాటు ఆధునిక వైద్యం అందించాలనే సంకల్పంతో మెడికల్ కాలేజి, అనుబంధ ఆసుపత్రిని తీసుకొచ్చి నిర్మాణం చేశామని తెలిపారు. అన్ని రకాల వైద్య నిపుణులు ఉన్నప్పటికీ ప్రమాదాల బారిన వారికి అత్యవసర వైద్యం, శస్త్ర చికిత్స అందించడానికి సరిపడా ఆధునిక పరికరాలను ఈ ప్రభుత్వం ఇప్పటికీ సమకూర్చక పోవడం వల్ల మెరుగైన వైద్యం అందని పరిస్థితి నెలకొందన్నారు. సకాలంలో వైద్యం అందక మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిలో ఎన్నుకోబడిన వారు కనీస వైద్య సదుపాయాలపై సమీక్షించిన పాపానపోలేదని విమర్శించారు. వెంటనే ఆసుపత్రికి ఆధునిక పరికరాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆత్మీయ భరోసా పథకం కూలీలకు వర్తింపజేయాలన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నల్లా మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, నాగిశెట్టి ప్రసాద్, గోనె యువరాజు, మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీదూడల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి పునర్నిర్మాణానికి విరాళాలు

నవతెలంగాణ-పర్వతగిరి



మండలంలోని గోపనపల్లి లోని శ్రీదూడల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి పునర్నిర్మాణం కోసం ఆలయ అభివృద్ధి కమిటీకి గురువారం గోపనపల్లి వాస్తవ్యులు కీ.శే వర్కాల మల్లమ్మ-రాజయ్య జ్ఞాపకార్థం వారి కొడుకు కోడలు జనార్దన్-లక్ష్మి ఆలయ పునర్నిర్మాణానికి సీసీ కెమెరాలు అమర్చారు. ఇందుకు గాను రూ.30116 ఇచ్చారు. అలాగే అదే గ్రామానికి చెందిన మంద కనకయ్య-నరసమ్మ దంపతులు ఆలయ పునర్నిర్మాణానికి రూ.10,116, అలాగే అదే గ్రామానికి చెందిన వర్కాల భాగ్యలక్ష్మి ఆమె కుమారులు శివకుమార్, భాను ప్రసాద్‌లు విరాళంగా రూ.5,116 ఆలయ కమిటీ చైర్మన్ బెల్లం రాధిక రాజు తెలిపారు.





ప్రమాదవశాత్తు బొలెరో బోల్తా ..

- ఒకరు మృతి..ఇద్దరు పరిస్థితి విషమం...
- పలువురికి గాయాలు....
- విషాదచాయలో జీడిగడ్డ తండా

నవతెలంగాణ-చెన్నారావుపేట

ప్రమాదవశాత్తు బొలెరో వాహనం బోల్తా పడిన సంఘటన మండలంలోని ఈర్య తండా సమీపంలో చోటు చేసుకుంది. గురువారం ఉదయం రోజు మాదిరిగానే జీడిగడ్డ తండా గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు తమ పొట్టకూటి కోసం వివిధ గ్రామాలకు వెళ్లి కూలి పనులు చేసుకునే వ్యవసాయ కూలీలు రోజు మాదిరిగానే గురువారం ఉదయం నర్సంపేట మండలం ఇటుకాలపల్లి గ్రామానికి మిరప తోటను వేరడానికి వెళుతుండగా ఈర్య తండా సమీపంలో బొలెరో వాహనం బోల్తా పడింది. బొలెరో వాహనంలో 35 మంది వ్యవసాయ కూలీలు అధిక లోడ్‌తో వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బానోతు సుక్య (60) అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కి తరలించారు. ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

కూలీల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలి..

- బాధిత కుటుంబాలను పరామర్శించిన సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ-చెన్నారావుపేట



మండలం లోని జీడిగడ్డ తండా గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మిరప తోట ఏరడానికి ఇటుకాలపల్లి గ్రామానికి వెళ్తున్న క్రమంలో ఈర్యతండా గ్రామ శివారులో బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో వాహనంలో ఉన్న కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం కోసం నర్సంపేటకు తరలించారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) నాయకులు ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్లి భాదిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఘటనకు సంబంధించిన వివరాలను భాదిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని స్థానిక డాక్టర్లు, సూపరింటెండెంట్‌తో సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడారు. హాస్పిటల్‌కు తరలిస్తుండగా గుగులోతు సూక్య మరణించారని, ఈర్య అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండడంతో ఎంజిఎంకి తరలించారన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన కూలీలకు మెరుగైన వైద్యం అందించాలని, భాదిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఈసంపల్లి బాబు, భూక్య సమ్మయ్య, కోరబోయిన కుమారస్వామి, నమిన్ల స్వామి, పరికి మధుకర్, హనుమకొండ శ్రీధర్, నర్సింగ రాములు,ఊడుగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం



నవతెలంగాణ-వరంగల్

వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమైనాయని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ తెలిపారు. గురువారం జిల్లా పరీక్షల కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పట్టణంలోని పలు కళా శాలల్లో నిర్వహించబడుతున్న ప్రథమ సంవత్సర పరీక్షల తీరు తెన్నులను పరిశీలించారు. నగరంలోని ఏవీవీ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను కన్వీనర్ శ్రీధర్ సుమన్ సందర్శించారు. ప్రతీ గదిలో విద్యార్థుల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఇంటర్ బోర్డు షెడ్యూల్ ప్రకారం పరీక్షల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పరీక్షా పర్యవేక్షకులను ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు ఎట్టి పరిస్థితిలో అనుమతించకూడదని, ఇంటర్ బోర్డు లో కమాండ్ కంట్రోల్ రూం ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ద్వారా జరుగుతున్న పర్యవేక్షణను తెలియజేసారు. జిల్లా వ్యాప్తంగా రెండవ రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో నీరు, గాలి, వెలుతురు, డ్యూయల్ డెస్క్ లు తదితర అన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ద్వితీయ భాష తెలుగు, హిందీ, సంస్కృతం, అరబిక్ తదితర భాష, ఒకేషనల్ పరీక్షలకు గాను జిల్లా వ్యాప్తంగా జనరల్ మొత్తం 4,838 విద్యార్థులకు గాను, 5473 విద్యార్థులు హాజరయ్యారు. 120 విద్యార్థులు గైర్హాజరైనారు. ఒకేషనల్ మొత్తం 668 విద్యార్థులకు గాను, 635 విద్యార్థులు హాజరైనారు. 33 విద్యార్థులు గైర్హాజరైయ్యారు. రెండవ రోజు మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదు. ఈసందర్శనలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు మాధవరావు, విజయనిర్మల, కార్యాలయ సిబ్బంది రాజశేఖర్, కొలంబో తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని పరీక్షా కేంద్రానికి చేర్చిన ఎస్సై

నవతెలంగాణ-నెక్కొండ

ఓ విద్యార్థి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు హాజరయ్యేందుకు పరిక్షా కేంద్రానికి వెళుతున్న క్రమంలో ఆలస్యం కావడంతో వెంటనే స్పందించిన ఎస్సై మహేందర్ తన వాహనంలో విద్యార్థిని పరీక్షా కేంద్రానికి సమయానికి చేర్చారు. నెక్కొండ లోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థిని ఇంటర్మీడియట్ పరీక్షకు ఎస్సై వాహనంలో పరీక్షా కేంద్రానికి తీసుకువెళ్లగాగా ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి

ఎస్ఎఫ్ఐ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణలో కేయూ వీసీ



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం అన్నారు. గురువారం యూనివర్సిటీ పరిపాలన భవనంలోని ఎస్ఎఫ్ఐ 2025 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమాజంలో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు ఎన్ని కష్టాలు వచ్చినా విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకుని మన ఊరికి మన తల్లిదండ్రులకు మన గురువులకు పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ కట్ల రాజేందర్, డాక్టర్ ప్రేమ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, యూనివర్సిటీ ఉపాధ్యక్షురాలు పరిమళ, సహాయ కార్యదర్శి బిరెడ్డిజశ్వంత్, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ సభ్యులు సాయికుమార్, కృష్ణ, రాజ్ కుమార్ సందీప్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-నయీంనగర్



ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి సందర్శించారు. వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాల, హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెజోనేన్స్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో చేసిన తాగునీరు, తదితర ఏర్పాట్లను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలపడిన బీసీ వాదం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

తెలంగాణ రాష్ట్రంలో వెలువడిన 3 ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలలో బీసీ వాదం బలపడిందని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు అన్నారు. హనుమకొండ లో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ శేషు మాట్లాడుతూ కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో బిజెపి బలపరిచిన బీసీ అభ్యర్థి విజయం సాధిస్తే అదే కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ , బీజేపీ ప్రధాన పార్టీలకు ధీటుగా బీఎస్‌పి బలపరిచిన అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకి 60 వేలకి పైగా మొదటి ప్రాధాన్యతా ఓట్లు సాధించి నైతిక విజయం సాధించారన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు భవిష్యత్ రాజకీయ పరిణామాలకి సమీకరణాలకు నాంది పలక బోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు ధరబోయిన సతీష్ ఎర్రబొజ్జ ,రమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

బయోఇన్‌పుట్ సెంటర్ సందర్శన

నవతెలంగాణ-శాయంపేట

గంగిరేణిగూడెం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులు ప్రజ్వల్ సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన అరుణ స్వశక్తి బయో ఇన్పుట్ సెంటర్లో తయారు చేస్తున్న ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తూ ఉత్తమ యాజమాన్య పద్ధతులను అవలంభిస్తూ తమ తల్లిదండ్రులకు వ్యవసాయం చేయాలని విద్యార్థులకు శాయంపేట పియు మేనేజర్ గుడిమల మానస చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతు సునీల్, గౌస్, తరాల తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-పరకాల




ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గత నెల 20వ తేదీన నిర్వహించిన పదవ తరగతి ప్రతిభా పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం ప్రభుత్వ గర్ల్స్‌హైస్కూల్ హెచ్ఎం మధు చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానుద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు స్టాలిన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే ప్రయత్నంగానే ప్రతి సంవత్సరం టెన్త్ టాలెంటెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడం కోసం కష్టపడి చదవాలన్నారు. చదువుతోపాటు సమాజంలోని సామాజిక రుగ్మతలకు అసమానతలకు వ్యతిరేకంగా వాటి పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు.

అనంతరం మండల స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకున్న శారద హై స్కూల్ విద్యార్థి నేరెళ్ల వంశీకి, రెండవ బహుమతి మల్కాపేట సోషల్ వెల్ఫేర్ విద్యార్థి కే శ్రీజ లను శాలువాతో సత్కరించి ఎగ్జామ్ ప్యాడ్, షీల్డ్ లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, పరకాల మండల అధ్యక్షులు మడికొండ ప్రశాంత్, పరకాల పట్టణ అధ్యక్షులు బొచ్చుఈశ్వర్, ఉపాధ్యాయులు పుష్ప, రమాదేవి, సాంబయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన చల్లా

నవతెలంగాణ-ఆత్మకూరు



మండలంలోని అక్కంపేటకు చెందిన కదుదుల పద్మమల్లయ్య దంపతుల కుమారుడు రాజేందర్-శ్రావణిల వివాహానికి గురువారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లేతాకుల సంజీవరెడ్డి, జిల్లా నాయకులు బుచ్చిరెడ్డి, కాంతుల కేశవరెడ్డి , రవి యాదవ్, మండల నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

నవతెలంగాణ-దామెర



దామెర మండలంలోని ఒగ్లాపూర్ నాయకులు కనుకుంట్ల రాజు జయలపుత్రిక సింధు కిరణ్‌ల వివాహ మహోత్సవానికి నాయకులు డాక్టర్ కాశీప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెసరు విజయచందర్ రెడ్డి, గురజాల శ్రీరామ్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు రాజ్ కుమార్, కనుకుంట్ల లక్ష్మణ్ రావు, కనుకుంట్ల జీవన్ రావు, మాదారపు రతన్, ఆకుల కుమారస్వామి, క్రాంతి కుమార్,నాగుల సదయ్య, దురిశెట్టి మహేందర్, మేడిపల్లి రవీందర్, కనుకుంట్ల కోటి తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా నేషనల్ డెంటిస్ట్ డే

నవతెలంగాణ-నక్కలగుట్ట



నేషనల్ డెంటిస్ట్ డే పురస్కరించుకొని మార్చి 6న గురువారం కలెక్టర్ కార్యాలయం నుండి పబ్లిక్ గార్డెన్ నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియం వరకు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వరంగల్ బ్రాంచ్ నిర్వహించిన 2కె వాకతాన్‌ను ప్రారంభించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ లోక్ సభ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్ పాల్గొని దంతవైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడిఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి.రాంప్రసాద్‌రెడ్డి, సెక్రెటరీ డాక్టర్ వేణుమాధవ్, ట్రెజరర్ డాక్టర్ కార్తీక్ తో పాటు డాక్టర్ జయసింహారెడ్డి, డాక్టర్ అనిల్ రెడ్డి, డాక్టర్ సురేందర్ రెడ్డి, డాక్టర్ మనోరంజన్ రెడ్డి, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ రజనీకాంత్ తదితరు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యువ ఉత్సవ కార్యక్రమంలో యువత భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల బొల్లికుంట లో ఈనెల 11న నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ జిల్లాలోని యువతీ యువకులకు వివిధ రకాలైన పోటీలనునిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.పోటీల వివరాలు యంగ్ రైటర్స్,యంగ్ ఆర్టిస్ట్, ఫోటోగ్రఫీ,ఉపన్యాసం, సంస్కృతిక జానపద నృత్యం, సైన్స్ ఎగ్జిబిషన్ దీనిలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంచ ప్రాన్ అనే అంశము పైన ఈ పోటీ లలో పాల్గొనాల్సి ఉంటుందని. అయితే గ్రూప్ ఫోక్ డాన్స్ ఫోటోగ్రఫీ కాంపిటీషన్ లో పంచ్ ప్రాన్ అంశం వర్తించదన్నారు. ఈ కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి మొదటి, రెండవ, తతీయ నగదు బహుమతి తోపాటు ప్రశంస పత్రం అందజేస్తామన్నారు. జిల్లాలోని యువజన సంఘాలు కళాశాల విద్యార్థులు తమ ఎర్లను రిజిస్ట్రేషన్ చేసుకోగలరని తెలియచేశారు. పూర్తి వివరాల కొరకై 7675824707, 9573393831లలో తెలియజేయాలని లేదా ఈ లింక్‌లో %https://docs.google.com/forms/d/e/1FAIpQLSd7 WM8la0NkK8XY_mejHPamH0g2ay33dBxO5eiJPzlqX-Yv1w/viewform?uspR% లో రిజిస్టర్ కావాల్సింది గా.ఈ ప్రకటన లో కోరారు.

ఉత్తమ నాయకత్వ లక్షణాలతో వ్యవస్థను నడిపించేది మహిళలే







నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

మహిళలు నిర్వహణ పదవుల్లో సమర్ధవంతంగా రాణించగలుగుతారని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. విశ్వవిద్యా లయ ఆడిటోరియంలో గురువారం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.భిక్షాలు అధ్యక్షతన నిర్వహించిన ముందస్తు 'మహిళా దినోత్సవ సంబరాల'కు వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. విశ్వవిద్యాలయ మహిళాఅధ్యాపకులు అడ్మినిస్ట్రేషన్‌లో మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. మహిళా సాధికారత విద్య ద్వారానే సాధ్యం అన్నారు. మహిళలు మల్టీ టాస్కర్స్ అన్నారు, మహిళలు ధైర్యంగా, డైనమిక్ గా ఉండాలి అన్నారు, విజయానికి షార్ట్ కట్స్ లేవని, తెలివితేటల జాగ్రత్తగా వాడుకుంటూ విజయపథాన్ని ఎంజాయ్ చేయాలన్నారు. మహిళల్లో మానసిక స్థిరత్వం ముఖ్యం అన్నారు, టెక్నాలజీ అభివద్ధి క్రమం లో చాల జాగ్రత్త వ్యవహరించాలి అన్నారు, విశ్రాంత తెలుగు విభాగ ఆచార్యులు ఆచార్య కాత్యాయనీ విద్మేహి మాట్లాడుతూ శ్రామిక వర్గాల పోరాట ఫలితమే మహిళా దినోత్సవం అన్నారు, సంఘటితం గా స్త్రీ వాద హక్కులను పరిరక్షించుకోవాన్నారు, మహిళలు ప్రశ్నించేతత్వం పెంచుకోవాలి అన్నారు.

ఈ కార్యక్రమాలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.స్వప్న, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో...

హనుమకొండ జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోనిర్వహించిన జాతీయ మహిళాదినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా నాయిని నీలిమరెడ్డి హనుమకొండ లోని అలంకార్ జంక్షన్‌వద్ద కార్యాలయం లో మహిళా ఉద్యోగులతో కలిసి వేడుకల్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా మహిళలకు వారు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్‌కట్‌చేసి శుభాకాంక్షలు తెలపగా టీఎన్జీఓ సభ్యులు నాయిని నీలిమరెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ అధ్యక్షులు ఆకుల రాజేందర్, కార్యదర్శి సోమయ్య, అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లూరి వేణు, కోశాధికారి పనికేల రాజేష్,జిల్లా మహిళా ఉద్యోగులు రాజ్యలక్ష్మి, జ్యోత్స్నపావని, కల్యాణి, శ్రీలత, యమున, మంజుల, రజిత,సింధు,స్వాతి, రవళి, జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్, రాంప్రసాద్, గౌతమ్, రాజమౌళి, శ్రీనివాస్, అనూప్, రాజీవ్,రమేష్,వంశీ, రాజేష్, సలీమ్, సుధాకర్, పృథ్వీ, ప్రణయ్, రాజు, భరత్, హమీద్, మహబూబ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

టీజీఓ ఆధ్వర్యంలో...

సుబేదారి : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ టీజీఓ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గత రెండురోజులుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా గెజిటెడ్ అధికారులకు క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. కలెక్టరేట్‌లోని భవన్ సుబేదారిలోని ఆఫీసర్స్‌క్లబ్‌లో నిర్వహించగా మహిళా అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలలో మహిళా ఉద్యోగులు హాజరుకావాలని కోరారు. హనుమకొండ జిల్లా అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, రాంరెడ్డి, పిఎస్ ఫణి కుమార్, నీరజ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎస్‌పీ నీటిని వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-ఐనవోలు



రైతులు పండించిన పంటలకు నీళ్ల లేక మొక్కజొన్న, వరి, బొబ్బరి చేన్లు ఎం డిపోతున్నా యని వెంటనే ప్రభుత్వం ఎస్సారెస్పీ ద్వారా నీళ్ల విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు మడిగే నాగరాజు, కొంకార నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశార్షు. గురువారం మండలంలోని నాగపురం, రాంనగర్, ఉడుతగూడెం, లింగమూరిగూడెం, నంద నం గ్రామాల్లో ఎండిపోతున్న పంటలను రైతు సంఘం ఏఐకేఎస్ ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా నాగరాజు నారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలోని రైతులు వేసినా పంటలకు నీరు లేక పంటలు ఎండిపోతూ రైతులు దిక్కులేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని వాపోయారు. కనీసం పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేనిదుస్థితి ఏర్పడుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన అన్ని పార్టీలు రైతుల ప్రభుత్వం అని చెప్పుకుంటుంది. తప్ప రైతులకు చే సింది ఏమీలేదని వారు తీవ్రస్థాయిలో మండిపడ్డా రు. రైతులను రాజులను చేయడం ఏమో కానీ ముందు ఎండిపోతున్న పంటలకు నీళ్ల ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. పంటకు కనీస మద్దతు ధర ఇవ్వలేం లేదని అన్నారు. మిర్చి పంట రైతులకు మిర్చి ధర క్వింటాల్‌కు రూ.25 వేలు చెల్లించాలని, వెంటనే ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేను డిమాండ్ చేశారు. లేకుంటే రైతుసంఘం ఆధ్వర్యంలో చేపడతామని హెచ్చరించారు. ఈనెల 8న 10 గంటలకు మండల కేంద్రంలోని రైతువేదిక దగ్గర జరగనున్న మండల సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల హాజరై జయప్రదం చేయాలని నాగరాజు పిలుపు నిచ్చారు.

అధికారం దుర్వినియోగానికి పాల్పడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



నవతెలంగాణ-ధర్మసాగర్

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ కడియం శ్రీహరి తన అధికార దాహంతో పార్టీనిమార్చి, ప్రజలకు మోసం చేయడమే కాకుండా తన అంగబలంతో స్థానిక సీఐ, ఎస్ఐలను ఉసిగొల్పి బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు, వార్డు సభ్యులైన జానకిపురంకు చెందిన కురుసపల్లి రమేష్‌ను పోలీస్‌స్టేషన్లో కొట్టించడం తన నియంత పాలనకు నిదర్శనమన్నారు. సోషల్‌మీడియా గ్రూప్‌లలో గ్రామానికి సంబంధించిన ఒక పోస్ట్ పెడితే,ఆ గ్రూప్ లో ఉన్న ఎమ్మెల్యే వర్గీయులు ఎమ్మెల్యేకు తెలుపగా వారు విచక్షణ రహితంగా కొట్టడమే కాకుండా దుర్భాషలాడుతూ తన మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. అసభ్యపదజాలంతో ధూషిస్తూ ఎమ్మెల్యేకే వ్యతిరేకంగా మాట్లాడే స్థాయికి చేరావా ? గ్రామంలో బీఆర్ఎస్ ఫ్లెక్సీలు కడతావా ? అని తన అధికార దుర్వినియోగం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎమ్మెల్యే తన కుమార్తె కడియం కావ్య రాజకీయ భవిష్యత్తు కోసం, బీఆర్ఎస్ బీఫామ్ తో గెలిచి పార్టీకి రాజీనామా చేయకుండా పదవిలో కొనసాగడం సిగ్గుచేటని, తిన్నింటి వాసాలు లెక్కబెట్టడమేనని తీవ్ర ఆరోపణలు చేశారు.ఇది ముమ్మాటికి రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, వ్యతిరేకమఅన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో నీచ రాజకీయాలు చేస్తున్నది కడియం శ్రీహరి, స్వార్థపూరితంగా చేస్తున్న రాజకీయాల కు ప్రజలే బుద్ధి రోజులు దగ్గర పడ్డాయని, నీ నీచ స్వార్థపూరితమైన రాజకీయానికి సమాధి చేస్తామని, నీకు దమ్ము, ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేసి గెలవాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు ప్రభుదాస్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కర్ర సోమిరెడ్డి, మాజీ ఎంపిటిసి బొడ్డు శోభ, మాజీ వైస్ ఎంపీపీ బండారి రవీందర్, ఎండి లాల్, దేవేందర్‌రావు, జోజి, మాజీ జెడ్పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు, బేరే మధుకర్, శేషాల నరేష్, కుర్సపల్లి ప్రవీణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పింగిళి మహిళా కళాశాలలో ఘనంగా యువ ఉత్సవ్-2025

నవతెలంగాణ-నయీంనగర్



పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల, హనుమకొండలో నెహ్రూ యువ కేంద్రం,వరంగల్ వారి ఆధ్వర్యంలో యువఉత్సవ్-2025 జిల్లాస్థాయి యువజనోత్సవ కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రతిభా పాటవ పోటీలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించి మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న సజనాత్మకతను ప్రదర్శించడానికి ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడు తాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ట్రెజరీ ఆఫీసర్ ఆకవరం శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ యువఉత్సవ్ కార్యక్రమం యువత ప్రతిభకు తార్కాణంగా నిలుస్తుందని, నృత్యం, కవితారచన, వక్తృత్వ పోటీలు తదిర పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నందుకు వారందరిని అభినందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో గౌరవఅతిథులుగా కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ ఎస్.రాజన్న, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ఎస్.శ్రీధర్, నెహ్రూ యువకేంద్రం సూపరింటెండెంట్ బి.దేవిలాల్, జె.శ్రీకాంత్, జిల్లా ఆరోగ్య ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించి యువతను చైతన్య పరిచారు. యువజనోత్సవాలలో భాగంగా జిల్లాలోని యువతీ యువకులకు యంగ్ రైటర్స్ ,యంగ్ ఆర్టిస్ట్ , ఫోటోగ్రఫీ, ఉపన్యాసం, జానపద నృత్యం(గ్రూప్), సైన్స్ ఎగ్జిబిషన్ మొదలైన పోటీలు నిర్వహించి అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ,తతీయ నగదు బహుమతి తోపాటు ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సురేష్ బాబు, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.అరుణ, ఎన్ఎస్ ఎస్ 1,2,3 యూనిట్ ప్రోగ్రాం అధికారులు కవిత, రామా రత్నమాల, డాక్టర్ వి.మమత, అధ్యాపకులు సామ్యేల్ ప్రవీణ్ కుమార్, సుజాత, మధు, డాక్టర్ లక్ష్మీ కాంతం, డాక్టర్ సునీత, రాజేశ్వరి, డాక్టర్ బాలరాజు, రేణుక, శ్రీలత, అరుణ, సారంగపాణి, జ్యోతి, లకన్ సింగ్, యుగంధర్, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

నూతన వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు గురువారం జరిగిన పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినారు. హనుమకొండ రాయల్ గార్డెన్స్‌లో విజయలక్ష్మి కుమార్తె మౌనిక , ప్రణయ్ లను, గోపాలపూర్ పరిమళ కాలనీలోని జెడ్ - కన్వెన్షన్‌హాల్‌లో నితీశ్, యశస్విని (శ్రీవల్లి), మడికొండ సత్యసాయి కన్వెన్షన్‌హాల్‌లో హర్షిక, చాణక్యలను, మడికొండరెడ్డి కన్వెన్షన్ హాల్ లో బైరి రాజు గౌడ్ కుమార్తెలు మనస్విని-రేవంత్ గౌడ్, తేజస్విని-అఖిల్ గౌడ్ లను, మామునూర్ హెచ్ఆర్ఎస్ ఫంక్షన్ హాల్‌లో మాచర్ల చంద్రమౌళి కుమార్తె అశ్విని-అఖిల్‌లను, వర్ధన్నపేట బంగారు సదానందం కుమార్తె రేష్మ-క్రాంతి కుమార్‌ను, పర్వతగిరిలో కళ్యాణ్‌నాయక్-లాస్యలను ఆశీర్వదించారు.

పేదల పార్టీ కాంగ్రెస్

నవతెలంగాణ-పరకాల

కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అని కాంగ్రెస్ ద్వారానే అన్ని వర్గాల పేదలకు న్యాయం జరుగుతుందని పరకాల పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు సోద రామకృష్ణ అన్నారు. గురువారం మున్సిపల్ 16వ వార్డులో బండి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు పథకాలను అమలు చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి,కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, ఎండి.రంజాన్ ఆలీ, చిన్నాల గోనాద్, ఒంటేరు రామ్మూర్తి, పావుశెట్టి వెంకటేశ్వర్లు, మడికొండ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ మడికొండ సంపత్ కుమార్, పంచగిరి జయమ్మ, ఏకు రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఎంసీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

- టీయూఎంహెచ్ఈయూ నేత కే.యాదానాయక్



నవతెలంగాణ-సుబేదారి

కాకతీయ వైద్యకళాశాలలో పని చేస్తున్న కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ డిమాండ్ చేశారు. కేఎంసీలోని 86మంది కార్మికులకు గత 8 నెలలుగా వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు తీరు మార్చుకుని వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు యాదానాయక్ ముఖ్యఅతిథిగా ధర్నాకు విచ్చేసి మాట్లాడుతూ కాకతీయ వైద్య కళాశాల హాస్టల్ నందు పని చేస్తున్న కార్మికులు ఎంతో ఓపికతోని గత 8 నెలలుగా వేతనాల కోసం నిరీక్షించడం చాలా బాధాకరమన్నారు. కలెక్టర్ వెంటనే జోక్యంచేసుకొని కార్మికులకు రావాల్సిన 8నెలల వేతనాన్ని వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో రేపటి నుండి జరిగే నిరవధిక సమ్మెకు కార్మికులందరూ పాల్గొంటారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జిలపల్లి సుధాకర్, కేఎంసీ బ్రాంచ్ నాయకులు అల్లం రమేష్, డి.రాణి, అతీక్, శరత్ ప్రశాంత్, కోమల రాజకుమారి, బాబు సుమన్, నరేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం మహిళలు సంఘటితం కావాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



ఈనెల ఎనిమిదిన జరిగే ప్రపంచ మహిళా దినోత్సవం విజయవంతం చేయాలని మహిళల హక్కుల కోసం మహిళలకు సంఘటితం కావాలని బీసీ మహిళ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం పద్మజాదేవి తెలి పారు. గురువారం హన్మకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ లో బీసీ మహిళా సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షురాలు మాడిశెట్టి అరుంధతి అధ్యక్షతన ప్రెస్ మీట్ జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం పద్మజాదేవి మాట్లాడుతూ ఈ నేల 8న ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు హన్మకొండ, వడ్డేపల్లి రోడ్, కనకదుర్గ కాలనీ వైష్ణవి బ్యాంకట్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన ఉత్తమ మహిళలను మేమంటో, శాలువతో ఘనంగా సత్కరించునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల నుండి బీసీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా సంఘం సభ్యులు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మలా శోభరాణి, జిల్లా బీసీ మహిళా నాయకురాలు బూర్గుల ప్రమదదేవి పర్స హైమ, సూర స్రవంతి, నాయిని సరస్వతి పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆత్మకూరు



దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నర్సింగరావు అన్నారు. మండలంలోని నీరుకుళ్ల సబ్‌సెంటర్‌లో వ్యాధిగ్రస్తులకు ఎన్‌సిడి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 72 మంది రోగులను పరీక్షలు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎంకు వెళ్లాలని సూచించినట్లు తెలిపారు.ఈ అవగాహన కార్యక్రమంలో సిహెచ్‌ఓ ఖలీమ్ జునేది, హెచ్ఎస్ అనిల్‌కుమార్, సాంబయ్య ఏఎన్ఎం మమత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగుర్ల

నవతెలంగాణ-నడికూడ



మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన నాగుర్ల అరుణబాయి-బాబురావు దంపతుల కుమారుడు వినీత్-సాధనల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగొర్ల వెంకటేశ్వర్లు. నాగూర్ల వెంట కేఎస్.రావు, జెండారాజేష్, జుపాక బాస్కర్, నాగుర్ల సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-దామెర

దామెర మండలం దుర్గంపేటలో ఇటీవల అనారోగ్యం తో మతి చెందిన ముత్యాల గణేశ్ కుటుంబానికి ఊరుగొండ బీఆర్ఎస్ అధ్యక్షు డు కునాటి సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థికసహాయం అందించ డం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గండు రామకృ ష్ణ, మాజీ సర్పంచ్ మల్లాడీ రాజిరెడ్డి, ఉప సర్పంచ్ జన్ను విద్యా సాగర్, మాజీ ఎస్సారెస్పీ చైర్మన్ పుచ్చకాయల నరసింహరెడ్డి, పెండ్యాల మధుకర్ రెడ్డి, నంద్యాల శ్రావణ్‌రెడ్డి, జన్ను విజయ్, జన్నుసాంబయ్య, గొంది సందీప్‌రెడ్డి, ఫైండ్ల శ్రీను, ఇట్టబొయిన శ్రీనివాస్, జన్నువీణయ్, రాగిడి కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

భూమనార్య శతకం పుస్తకం ఆవిష్కరణ

నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగ పని చేస్తున్న ఎం.విజయలక్ష్మి భూమనార్య శతకాన్ని రచించారు గురువారం హన్మకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయంలోని హ్యూమానిటీస్ బిల్డింగ్‌లోని తెలుగు సెమినార్‌హాల్‌లో భూమనార్య శతకం పుస్తకాన్ని విజయలక్ష్మి ఆమె గురువైన అనుమాండ్ల భూమయ్య చేతుల మీదుగ అవిష్కరించారు. అనంతరం భూమనార్య శతకాన్ని తన గురువు అనుమాండ్ల భూమయ్యకు అంకితం చేసి శాలువా, మెమోంటోతో సత్కరించారు.

బ్రేకర్‌ను ప్రారంభించిన డీఈఈ

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని ప్రగతి సింగారంలో 11కేవీ బంచ్ ఫీడర్‌ను ఏర్పాటు చేసి కొత్త బ్రేకర్‌ను చార్జ్ చేయగా గురువారం విద్యుత్ శాఖ డీఈఈ సౌమ్యనాయక్ బ్రేకరన్ను ప్రారంభించారు ఈ సౌమ్యనాయక్ మాట్లాడుతు సమ్మర్ యాక్షన్లో భాగంగ ప్రగతి సింగారం 1133కేవీ సబ్ స్టేషన్ లోని 11కేవీ బంచ్డ్ ఫీడర్ కాట్రపల్లి, ప్రగతి సింగారం ఫీడర్లను వేరు చేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో ఏడీఈ దేవేందర్నాయక్ శాయంపేట ఏఈ చందూలాల్ పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన కరస్పాండెంట్

నవతెలంగాణ-కోల్‌బెల్ట్



జిల్లా కేంద్రంలోని సింగరేణి పాఠశాల పదవ తరగతి విద్యార్థిని మాచర్ల ఆశ్రితను గురువారం పాఠశాల కరస్పాండెంట్ కావూరి మారుతి అభినందించారు. భారత ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం వారు 2024-25 సంవత్సరానికి గాను 3311 మందిని ఇన్‌స్పిరేషన్ అవార్డుకు ఎంపిక చేయగా, ఆ జాబితాలో ఆశ్రిత పేరు చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, భూపాలపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి మాట్లాడుతూ ఇన్స్పిరేషన్ అవార్డుకు సింగరేణి పాఠశాల విద్యార్థిని ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేయడమే కాకుండా, మిగిలిన విద్యార్థులు ఆశ్రితను ఇన్స్పిరేషన్‌గా తీసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని, తద్వారా పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్. ఝాన్సీ రాణి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

3

జయశంకర్

ములుగు - భూపాలపల్లి

శుక్రవారం మార్చి 07, 2025

రక్తదానంలో యువత ముందు ఉండాలి

నవతెలంగాణ-ములుగు



యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో బ్లడ్ సెంటర్లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రక్తం కొరతను అధిగమించేందుకు మేము సైతం కార్యక్రమానికి పిలుపు నివ్వడం జరిగిందన్నారు. జిల్లాలో ఎనీమియా, తలసేమియా, సికిల్‌సెల్ వంటి సమస్యలు ఉన్నాయని, వీటితో పాటు అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందించేందుకు సరిపడా నిల్వలు లేవని అన్నారు. రక్తదాన కార్యక్రమంలో పురుషులతో పాటు మహిళలు కూడా పాల్గొనాలని అన్నారు. ఇదే స్ఫూర్తితో ఆరోగ్యవంతు లైన ప్రతిఒక్కరూ రక్తదానం చేయవచ్చని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులో 25శాతం రాయితీ

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

నవతెలంగాణ-భూపాలపల్లి



మార్చి 31 లోపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారులకు ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీ అవకాశం కల్పించినట్టు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో మున్సిపల్, పట్టణ ప్రణాళిక, పంచాయతి అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిష్కరించే అంశంపై సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ పరిధిలో మున్సిపల్ అధికారులు, పంచాయతిల పరిధిలో పంచాయతి అధికారులు సమన్వయంతో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చి 31 లోపు ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియకు చెల్లించు మార్కెటింగ్ ఫీజు చెల్లిస్తే దరఖాస్తు దారులకు 25 శాతం రాయితి అవకాశం కల్పించినట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక అధికారి సునీల్, పంచాయతి కార్యాలయ ఏఓ బుచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన పెంచుకోవాలి

నవతెలంగాణ- గోవిందరావుపేట



హెచ్ఐవి మీద ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని వైఆర్‌జి కేర్ లింక్ వర్కర్స్ స్కీమ్ సంస్థ లింక్ వర్కర్ తప్పెట్ల కిషన్ అన్నారు. గురువారం మండలంలోని పస్రాలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిషన్ 95 క్యాంపెనింగ్‌లో49 మంది హెచ్ఐవి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వై ఆర్ జి కేర్ లింక్ వర్కర్స్ స్కీం సంస్థ లింక్ వర్కర్ తప్పెట్ల కిషన్, ఐసిటిసి కౌన్సిలర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హెచ్ఐవి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. భావితరాలను కాపాడి, హెచ్ఐవి ఎయిడ్స్ రహిత తెలంగాణ తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరోజన , నాగమణి, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

సన్నధాన్యానికి బోనస్ వెంటనే ఇవ్వాలి

బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోగు నాగేష్

నవతెలంగాణ -తాడ్వాయి



ఎన్నికల హామీలో భాగంగా సన్న వడ్లు పండించిన రైతులకు కింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తా అన్న కాంగ్రెస్ సర్కార్, వెంటనే రైతులకు బోనస్ రైతుల అకౌంట్లో వేయా లని బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోగు నాగేష్ డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పిందని మండిపడ్డారు. మండలంలో కొద్ది మంది రైతులకే పడ్డాయని, ఇప్పటివరకు ఎక్కువమంది రైతులకు సన్న వడ్ల బోనస్ పడలేదని ఆయన ఆవేదన చెందారు. ధాన్యం అమ్మిన వెంటనే బ్యాంక్ ఖాతాలో బోనస్ వేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం, సుమారు రెండు నెలలు కావస్తున్న ఇప్పటికీ రైతులకు బోనస్ డబ్బులు పడలేదని మండిపడ్డారు.వడ్లు విక్రయించాక నెలలల తరబడి ఎదురుచూస్తున్న బోనస్ డబ్బులు మాత్రం వేయడం లేదన్నారు. వెంటనే ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ పెద్దలు స్పందించి సన్నవోడ్లు పండించిన రైతులకు బోనస్ పైసలు వెంటనే వేయాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నవతెలంగాణ-చిట్యాల



బాల్య వివాహం జరుగుతుందని సమాచారం మేరకు చిట్యాల సిఐ మల్లేష్ యాదవ్ ఆదేశాల మేరకు వివాహాన్ని అడ్డుకున్నట్లు సెకండ్ ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. గురువారం మండలంలోని లక్ష్మి పురం తండా గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందని సమాచారం తెలుసుకొని పోలీస్ వారి సహాయంతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బంది పెళ్లిని ఆపి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి పెళ్లి ని ఆపి ఆ మైనర్ అమ్మాయిని వారి తల్లితండ్రులను చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది కౌన్సిలింగ్ గురించి భూపాలపల్లి ఆఫీస్ కు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్ కానిస్టేబుల్ లింగన్న నాగరాజు పాల్గొన్నారు.

పురుగుల మందు సేవించి మృతి

నవతెలంగాణ-చిట్యాల

పురుగుల మందు సేవించి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని చైనాపాక గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్సై 2 ఈశ్వరయ్య తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చైనాపాక గ్రామానికి చెందిన పెద్ది కిష్టస్వామీ (60) మద్యం త్రాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి, మద్యం మత్తులో ఇంట్లోని గుర్తు తెలియని పురుగుల మందు తాగాడని, వెంటనే చికిత్స నిమిత్తం చిట్యాల హాస్పిటల్‌కి తీసుకెళ్లగా వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎం వరంగల్‌కి పంపగా చికిత్స పొందుచు మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-చిట్యాల

మనస్థాపానికి గురై యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఒడితల గ్రామంలో గురువారం జరిగింది.చిట్యాల సెకండ్ ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం ఓడితల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి పల్లవి (19) ఇంట్లో ఉరేసుకుని తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడిందని పల్లవి తండ్రి సదానందం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.పల్లవి, ఆమె తల్లి విజయ ఇద్దరు అనారోగ్యంతో బాధపడుతున్నారని, వైద్యానికి లక్షల్లో ఖర్చు అవుతాయని, డబ్బులు లేకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

ఏఎన్ఎస్ ఆధ్వర్యంలో యోగితానగర్ నుంచి పాదయాత్ర

నవతెలంగాణ-వెంకటాపురం

బహుళజాతి మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ..ఆదివాసీ నవనిర్మాణ సేన అద్వర్యం గురువారం యోగితానగర్ తహశీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. డిమాండ్ లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ మహేందర్‌కు అందజేశారు. ఈ పాదయాత్రకు గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు, జిఎస్పీ జిల్లా కార్యనిర్వాహణ అధ్యక్షులు పూనెం ప్రతాప్, కుంజ మహేష్, నాగరాజు, కంతి వెంకట్, వాజేడు వెంకటాపురం మండలాల రైతులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ

నవతెలంగాణ-భూపాలపల్లి



నిబంధనకు అనుగుణంగా ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించి,విద్యార్థుల హాజరు శాతంగురించి చీఫ్ సూపరింటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష నిర్వహించాలని, నిర్దేశిత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా లేదా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను పోలీసు బందోబస్తు మధ్య క్లోస్డ్ వాహనంలో నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించకూడదని, నిశిత పరిశీలనతో విద్యార్థులను అనుమతించాలని స్పష్టం చేశారు. వైద్య సేవల కేంద్రాన్ని పరిశీలించి మందులను పరిశీలించారు. విద్యార్థులు ఏదేని అస్వస్థతకు గురైతే తక్షణ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్మీడియట్ పరీక్ష రెండవ రోజు ప్రశాంతం

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 34 కళాశాలు ఉన్నాయి. 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా1688 మంది విద్యార్థులకు గాను 1657 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా 31 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండలాల వారీగా వివరాలు ఇలా వున్నాయి. తాడిచర్ల (మల్హర్) మండలంలో 133 మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరయ్యారు. అలాగే మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 139 మందికి గాను 3గురు గైర్హాజరయ్యారు. ఇక్కడ జనరల్ విద్యార్థులు 114, వొకేషనల్ వారు 30 మంది ఉన్నారు. కాటారం ప్రభుత్వ కళాశాలలో 192 మంది విద్యార్థులకు గాను 3 మంది గైర్హాజరయ్యారు భూపాలపల్లి జూనియర్ కళాశాలలో 225 మందికి గాను 13 మంది గైర్హాజరయ్యారు. చిట్యాలలో 306 మందికి గాను అందరూ హాజరయ్యారు. కాటారం మండలం గంగారం గ్రామంలోని టీజీఎంఎస్ పరీక్షా కేంద్రంలో 135 మందికి గాను 3 గైర్హాజరయ్యారు. చిట్యాల టీజీఎంఎస్లో 303కి గాను 5 మంది గైర్హాజరయ్యారు. .తేజస్విని జూనియర్ కళాశాలలో 221 మందికి గాను 3 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 1688 మందికి గాను 1657 మంది హాజరుకాగా 31 మంది గైర్హాజరయ్యారు. 98శాతం మంది హాజరు అయ్యారని ఇంటర్మీడియట్ నోడల్ కోఆర్డినేటర్ వెంకన్న తెలిపారు.

అత్యాచార నిందితునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు

నవతెలంగాణ-భూపాలపల్లి



అత్యాచారానికి పాల్పడ్డ నిందితునిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగిత్యాల జిల్లా రాయికల్లో దళిత మహిళ ఆశావర్కర్ డ్యూటీ పూర్తిచేసుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా, ఒక కామాందుడు దౌర్జన్యం చేసి, అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపారు. ఘటన జరిగి వారం రోజులవుతున్నా, నిందితున్ని పోలీసులు ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని ఆరోపించారు. పోలీసుల నిర్లక్ష్యం, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించక పోవడంతో ఇలాంటి ఘటనలు జరుగు తున్నాయన్నారు. చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, మహిళల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారుల మీద చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితున్ని కఠినంగా శిక్షించాలి. బాధితురాలికి సరైన వైద్యం అందించాలని, ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి తక్షణమే నిందితునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల పాలిట శాపంగా ఎగుమతి సుంకాలు

మిర్చి పంటకు చట్టబద్ధత కల్పించాలి

క్వింటా మిర్చికి రూ.25 వేలు చెల్లించాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన రావు

నవతెలంగాణ-వెంకటాపురం



విదేశీ ఎగుమతి సుంకాలు,వివాదాలు మిర్చి రైతులకు శాపంలా మారాయి. మిర్చి ఎగుమతులు విదేశీ మారక నిల్వలు పెంచుకున్న కేంద్ర ప్రభుత్వం ఆపదలో ఉన్న మిర్చి రైతులను ఆదుకోవడంలో వైఫల్యం చెందిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన రావు విమర్శించారు. గురువారం ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని మిర్చి రైతులను కల్లాల్లో పలకరించారు. అనంతరం ఆయన రైతులతోబుమాట్లాడుతూ... గత రెండేండ్లుగా గిట్టుబాటు ధర లేక మిర్చి రైతులు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఒక్కరిద్దరు రైతులకు మాత్రమే గరిష్టంగా 20 కింటాళ్ల మిర్చి వస్తుందని, 15 క్వింటాళ్లకు దిగుబడి దాటే పరిస్థితి లేదన్నారు. దిగుబడి తగ్గినా మద్దతు ధర వస్తుందనుకొని మిర్చిని మార్కెట్కు తరలిస్తే వరంగల్, ఖమ్మం మార్కెట్లో క్వింటాకు రూ.ల12వేల నుంచి రూ.13వేలకు మించి ధర పలకట్లేదని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులకు మద్దతు ధర చట్టం తేవాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి ఒకటిన్నర రెట్లు అదనంగా మద్దతు ధర ఉండాలని పేర్కొన్నదని, మద్దతు ధర చట్టంచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రైతు సంఘాలుకో అమలు చేయట్లేదని విమర్శించారు. అనంతరం మండల కేంద్రంలో చిట్టెం ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన మిర్చి రైతుల జిల్లా స్థాయి సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మిర్చి పంట సాగు చేస్తున్న రైతులకు గత రెండు సంవత్సరాలుగా తీవ్రమైన నష్టాలు చవిచూడాల్సి వస్తుందన్నారు. గత సంవత్సరం నుండి మిర్చి పంటకు ధర ఎందుకు పడిపోతుంది, పరిష్కారం ఎవరు చూపాలి అని ప్రశ్నించారు.

మార్కెట్లలో దళారులు బస్తాకు రెండు నుంచి ఆరు రూపాయలు కాజేస్తున్నారని విమర్శించారు. మోడీ పాలనలో 1.74 వేలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు.

పొగాకు పసుపు బోర్డులు వలె రాష్ట్రంలో మిర్చి బోర్డును కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు . భవిష్యత్తులో కంపెనీ వ్యవసాయం, కాంట్రాక్టు వ్యవసాయాలు ఐక్యతతో సంఘటితంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు తుమ్మల వెంకటరెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న పత్తి వేరుశెనగ రైతులు తీవ్రంగా నష్టపోయారని వారికి కేరళ ప్రభుత్వం తరహాలో ప్రైవేట్ అప్పులను కూడా డిమాండ్ చేశారు సిపిఎం పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు రైతు సంఘం జిల్లా నాయకులు ఎండి గఫూర్ ఆగి రెడ్డి పార్టీ మండల కార్యదర్శి జ్ఞానం వాసు సిఐటియూ జిల్లా అధ్యక్షులు ఎం దావూద్ కట్ల చారి తదితరులు పాల్గొన్నారు.

మహిళ సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంగోత్ సుగుణ

నవతెలంగాణ-గోవిందరావుపేట



మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పాలన ముందుకు సాగుతోందని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంగోతు సుగుణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగ కళ్యాణి ఆధ్వర్యంలో మహిళా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంగోత్ సుగుణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పింగిళి జ్యోతి రెడ్డి విచ్చేసి ములుగు జిల్లాలో మహిళా మెంబర్షిప్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహిళా నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భముగా సుగుణ, జ్యోతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళల అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, సీఎం రేవంత్ రెడ్డి మహిళా సాధికారతే లక్ష్యంగా, ప్రతి మహిళను కోటేశ్వరులను చేయడమే లక్ష్యంగా సాగుతున్నారన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం, మహిళలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ ఇస్తూ మహిళలకు అండగా నిలిచిందన్నారు. మహిళా సంఘాలకు నూతన ఒరవడిని సృష్టిస్తూ ఆర్టీసీ బస్సుల నిర్వహణ కూడా మహిళా సంఘాలకు అందజేయనున్నారు. మహిళా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి రైల్వే స్టేషన్లో మహిళా సంఘాల టీ స్టాల్స్ ఏర్పాటు చేయడం, రాష్ట్రంలో ఉన్న 50 రైల్వే స్టేషన్లలో 50 స్టాల్స్ ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ బాధ్యత కూడా మహిళా సంఘాలకు ఇస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ కూడా మహిళా మెంబ ర్షిప్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి తెలంగాణ రాష్ట్రంలో ములుగు జిల్లాకు ప్రథమ స్థానాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ, మహిళా కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, కర్ల అరుణ, పేడిక లక్ష్మీ, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి, వసంత తదితర మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

మదర్ మేరీ పాఠశాలకు భూమి పూజ

నవతెలంగాణ/ కాళేశ్వరం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఉన్న ఎస్టీ మదర్ మేరీ పాఠశాల నూతన భవనంకు భూమి పూజ చేశారు. గురువారం ఉదయం డాక్టర్ ఉడుమల బాల డిడి ఆధ్వర్యంలో గ్రామస్తుల సమక్షంలో భూమి పూజ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.... అన్ని కుల మతాలకు అతీతంగా ఎస్ టి మదర్ మేరీ పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేకమైన కార్యక్రమంలో పాల్గొని అక్కడ నృత్యాలు చేసిన పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మదర్ మేరీ పాఠశాల యాజమాన్యం జోకేష్ రెడ్డి, జయపాల్, పాఠశాల హెడ్మాస్టర్,కరస్పాండెంట్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు రేవల్లి నాగరాజు శ్రీనివాస్ రెడ్డి, పిల్లల తల్లిదండ్రులు తల్లితండ్రులు ఉన్నారు.



స్త్రీల సమానత్వం కోసం పోరాటాలు చేయాలి

నవతెలంగాణ-ములుగు

స్త్రీలు సమానత్వం కోసం, దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం స్ఫూర్తితో పోరాటాలు చేయాలని అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కురెందుల సమ్మక్క పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సరిత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రామిక మహిళా జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా సమ్మక్క హాజరై మాట్లాడుతూ115 సంవత్సరాల క్రితం శ్రామిక మహిళా కార్మిక వర్గం పోరాడి తమ హక్కుల సాధించుకున్న రోజు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం పోరాట దినమన్నారు. ఆనాటి శ్రామిక మహిళలు సాగించిన పోరాట స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక, రాజకీయ హక్కులకై, , సమాన పనికి సమాన వేతనంకై చైతన్యంతో మహిళలు ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాల కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, రమ, నిర్మల, కవిత, నసీమా, సమ్మక్క, రోజరాణీ, లక్ష్మి శ్రీకల, శారద దేవి, సీతా రత్నం, నాగమణి అమృత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అందరూ పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి

అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

విద్యార్థులందరూ పరీక్షకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి ప్రభుత్వ పాఠశాల సిబ్బందికి సూచిం చారు. గురువారం జిల్లాలోని11 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల, ఆరు ఆదర్శ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ఇంటర్మీడియట్ స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాల్ లతో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి జూమ్ మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు ప్రయాణించే సందర్భాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తప్పనిసరిగా ఒక ఉపాధ్యాయున్ని ఎస్కార్ట్ గా విద్యార్థులతో పంపాలని,దూర ప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.విద్యార్థులు పరీక్ష వ్రాసి వచ్చిన తర్వాత ఆహార విషయాలలో శ్రద్ధ వహించాలని సూచించారు.విద్యార్థులు అందరూ పరీక్షకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్‌మైనారిటీ,సోషల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం

నవతెలంగాణ-ములుగు

9వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మల్లంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా లో మెడిటేషన్, ఆసనాలు, హెల్త్ డైట్ పై ఓరియంటేషన్ క్లాస్ నిర్వహించారు. సన్ స్ట్రోక్ పవేంటేషన్ గురించి కూడా వివరించారు. ఇందులో భాగంగా ములుగు డిపిఎం లీచంద్ర, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి సంధ్య, ఫార్మసిస్ట్ ఉష , యోగా ఇన్స్టక్టర్ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు, మిగతా స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

బిట్స్ హైస్కూల్ విద్యార్థినికి విశ్వ కళాంజలి అవార్డు

నవతెలంగాణ-ములుగు



ములుగు జిల్లా కేంద్రంలోని బిట్స్ హైస్కూల్ విద్యార్థిని విశ్వ కళాంజలి అవార్డు పొందడం సాధించింది. బిట్స్ స్కూల్ లో మూడవ తరగతి చదువు చున్న గోగినేని జోషితకు రవీంద్ర భారతిలో శ్రీ శాంతి కృష్ణా సేవా సమితి వారు విశ్వ కళాంజలి అవార్డు ప్రదానం చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి కవిత గురువారం తెలిపారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ అవార్డు రావడానికి కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.

అనారోగ్యంతో ఏబిపిఎం ఊకె బుచ్చయ్య మృతి

శ్రద్ధాంజలి ఘటించిన పోస్టల్ ఉద్యోగులు

దహన సంస్కారాలకు రూ.10వేల అందజేత

నవతెలంగాణ -తాడ్వాయి



మండలంలోని లింగాల మొదటి ఏబిపియం(కాంట్రాక్ట్ పోస్టల్ ఉద్యోగి) ఊకే బుచ్చయ్య (60) అనారోగ్యం తో మృతి చెందాడు. లింగాల ఏబిపిఎం ఊకే బుచ్చయ్య 1984లో (జిడిఎస్) పోస్ట్ ఆఫీస్ కాంటాక్ట్ ఉద్యోగిగా లింగాల పోస్ట్ ఆఫీస్‌లో ఉద్యోగంలో జాయిన్ అయ్యాడు. అప్పటినుండి ఆయన సైకిల్ పై పోస్టు విధులు నిర్వహించేవాడు. అప్పుడు లింగాల, కొడిశల, పస్రా రోడ్డు చాలా అధ్వానంగా ఎడ్లబండ్ల తోవ ఉండేది. ఆ రహదారి గుండా నాన్న ఇబ్బందులు పడుకుంటూ కూడా సైకిల్ పై ప్రయాణించి పోస్ట్ ఆఫీస్ కు విశిష్ట సేవలందిం చాడు. ఒకానొక సందర్భంలో పోస్ట్ విధులు నిర్వహిస్తున్న సమయంలో నక్సలైట్ మూమెంట్ అప్పుడు సిఆర్పిఎఫ్ పోలీసులతో దెబ్బలు కూడా తిని విధులు నిర్వర్తించినట్లు గ్రామస్తులు రోదించారు. పస్రా సబ్ పోస్ట్ ఆఫీస్ (ఎస్ ఓ) లోనే సీనియర్ ఉద్యోగి. ఆయన మృతి చాలా బాధాకరమని పోస్ట్ ఆఫీస్ శాఖ ఉద్యో గులు దిగ్భ్రాంతి గురయ్యారు. దాహన సంస్కారాల నిమిత్తం పోస్ట్ ఆఫీస్ ఉద్యోగులు పది వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ పి ఎం శ్రీనివాస్, మెయిల్ ఓవర్సీర్ అశోక్, బి పి ఎం లు ఊకె నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సందీప్, ప్రణతి, రాజకుమార్, హరీష్, సంతోష్, తరుణ్, రాహుల్, ఏబిపిఎం లు సాదిక్ పాషా, అశోక్, మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీల రాజ్యాధికారం కోసం పాటుపడాలి

బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు పొన్నం బిక్షపతి

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

దేశంలో రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల ప్రజలు రాజ్యాధికారం కోసం పాటుపడాలని బిఎస్‌పి జయశంకర్ జిల్లా అధ్యక్షుడు పొన్నం బిక్షపతి గౌడ్ తెలిపారు.గురువారం బుర్రి కుమార్ స్వామి,రేణిగుంట్ల సునీల్ లను కండువా కప్పి బిఎస్‌పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షులుగా బుర్రి కుమార్ స్వామి కురుమ, మండల ఉపాధ్యక్షులుగా రేణికుంట్ల సునీల్ లను నియమించారు.అనంతరం బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ...అగ్రవర్ణ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కుమారస్వామి మాట్లాడుతూ.. పార్టీలోకి ఆహ్వానించిన బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు, బిఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షులు మేకల ఓంకార్, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జి వేల్పుగొండ మహేందర్‌లకు ధన్యవాదాలు తెలిపారు.పార్టీ అభివృద్ధికి క్షేత్రస్థాయిలో పనిచేస్తానని తెలిపారు.

ఎన్నికల కోడ్ ఎత్తివేత : కలెక్టర్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఎత్తేశారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం తెలిపారు. దీంతో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియామవళి కింద ఉన్న ఆంక్షలను ఎత్తివేసినట్లు వెల్లడించారు. జనవరి 29 నుండి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే.

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి మైనారిటీ గురుకుల పాఠశాల కళాశాలల్లో 5 నుండి 8వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు మార్చి 31వరకు గడువు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్ కుమార్ గురువారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఫోన్ నెంబర్ 9346677568, 9441903130, 9912230123 లకు గాని దగ్గర్లోని మైనారిటీ ల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ ను కానీ సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

సాంఘీక సంక్షేమ గురుకు లంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏ7 ఫౌండేషన్ వ్యవ స్థాపకులు బరిగేల అరవింద్ వి ద్యార్థులకు పరీక్ష సామాగ్రిని గురు వారం అందజేశారు. ఉన్నత చదు వులు చదివి అన్నీ రంగాలలో ఎద గాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మాదారపు విజయ్ కుమార్, ఫౌండేషన్ సభ్యులు అరవింద్, వంశీ, అరుణ్, మనీ, కన్నయ్య , ప్రణయ్, డేవిడ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సందీప్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బచ్చన్నపేట

కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకుడు, సామాజికవేత్త జిల్లా సందీప్ జన్మదిన వేడుకలు జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బచ్చన్నపేట మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో శాలువలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్ల నాగుల శ్వేతా వెంకన్న, గంగం నరసింహరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు ఎద్దు హరీష్, హరికష్ణ, బోయిని కొండస్వామి, కర్రె నరేష్, అఖిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటిసంపులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-బచ్చన్నపేట

ప్రమాదవశాత్తు కాలుజారి నీటి సంపులో పడిపోయిన వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ ఎస్‌కే హామీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బీడీకాలనీలో మహంకాళి బాలచారి అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం తన ఇంటి ముందు ఉన్న సంపులో నీళ్ల కోసం వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారి అందులో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ పరీక్షలు



నవతెలంగాణ-పాలకుర్తి

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరి గాయని ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రం సిఎస్ సందరాజా స్వరూప తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 258 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరు కావా లసి ఉండగా 252 మంది పరీక్షలకు హాజరయ్యారని, ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షల కేంద్రాన్ని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి, ఎస్సై దూలం పవన్ కుమార్ లు సందర్శించి పరిశీలించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



నవతెలంగాణ-బచ్చన్నపేట

ప్రాథమికోన్నత పాఠశాల దబగుంటపల్లిలో స్వయం పరిపాలన దినోత్స వం ఘనం గా జరిగింది. డిఈవోగా వివేక్, ప్రధానోపాధ్యాయునిగావిష్ణు, ఎంఈవోగా లిఖిత, ఉపాధ్యాయు లుగా అక్ష య, కృతిక, నిత్య, భవ్య, కుమారస్వామి, ఐశ్వర్యలు వ్యవహరించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖాధికారి ఇర్రి వెంకరెడ్డి హాజరై మాట్లాడుతూ స్వయం స్వపరి పాలన దినోత్సవం లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించడం చాలా అద్భుతమైన అవకాశమని అన్నారు. బోధించడం అంటే బాధించడం కాదని ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని అన్నారు. ఈ కార్యక్రమానికి కాంప్లెక్స్ హెచ్ఎం బాలకిషన్‌రావు, ఉపాధ్యాయ బృందం అమీర్,గొట్టె కనకయ్య, శ్రీవిద్య, దీక్షిత, మమత ,పద్మలు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-బచ్చన్నపేట

ఎండుతున్న పొలాలకు సాగునీరు అందించాలని సర్పంచుల ఫోరం మండలం మాజీ అధ్యక్షుడు గంగం సతీష్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభు త్వం లో 10 సంవత్సరాలు ఒక్క ఎకరం వరిపొలం కూడా ఎండిన చరిత్ర లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 నెలల్లోనే భూగర్భ జలాలు అడుగంటి వరి పొలాలు ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయని, నీళ్లు అందించక రైతుని ఆరి గోస పెడుతున్నారని అన్నారు. వరి పంట ఎండిపోతున్న, అధికారులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రెండు మూడు రోజులలో చెరువులు,కుంటలకు నీరు అందించి ఈ ప్రాంతంలోని ఉండే పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఇరిగేషన్ ఆఫీస్ వద్ద, చౌరస్తాల వద్ద రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలు చేపడుతామని హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్



నవతెలంగాణ-నడికూడ

మండలంలోని చర్లపల్లి గ్రామంలో గురువారం పోలీస్ పెట్రోలింగ్ లో భాగంగా ఎస్సై రమేష్. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ రాజయ్య, దేవేందర్, రామకష్ణ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండగా చర్లపల్లి బస్టాండ్ వద్దకు చేరుకోగా రెండు టూ వీలర్లపై నలుగురు వ్యక్తుల వస్తు పోలీస్ వాహనాన్ని చూసి అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనాలను వెనక్కి తిప్పుకొని పారిపోతున్న క్రమంలో ఒక ద్విచక్ర వాహనం పై ఉన్న వారిని పట్టుకోగా ఒక ద్విచక్ర వాహనంపై ఉన్నవారు పరారయ్యారు. దొరికిన వారి వద్ద రెండు కిలోల ఎనిమిది వందల 40 గ్రాములు 1 లక్ష 42వేల విలువచేసే గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద ఉన్న ద్విచక్ర వాహనాన్ని సెల్ఫోన్, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ క్రాంతి కుమార్ తెలిపారు. నిందితుల వివరాలు పప్పుల్ బాలయ్య వయస్సు 25 ఒడిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి, ముదిగొండ ప్రశాంత్ వయస్సు 23 భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వ్యక్తులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న వారిని త్వరలోనే అరెస్టు చేసి రిమాండ్ కు పంపిస్తామని సిఐ క్రాంతి కుమార్ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-వరంగల్

నిబంధనలు ఉల్లంఘించిన వారికి చర్యలు తప్పవని రాష్ట్ర ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుమిత్ర అన్నారు. వరంగల్ హనుమకొండ లో గురువారం కమిషనర్ కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశం ప్రకారం వరంగల్, హనుమకొండ జిల్లాలలో రాష్ట్ర ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుమిత్ర నాయర్ పీసీ,పీఎన్ డీటీ, ఎంటీపీ ఆక్ట్ ప్రకారం పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమిత్ర మాట్లాడు తూ చట్టం ఉల్లంఘిస్తున్న వారి వివరాలు 10 4,1098 లేదా డయల్ 100 కి తెలియచేయా లన్నారు. ఈ కార్యక్రమంలో మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ అర్చన,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టులో కార్మెల్ విద్యార్థుల ప్రతిభ

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా లిజ్‌బెత్



నవతెలంగాణ-పాలకుర్తి

ఇండియన్ ఒలంపియాడ్ రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టులో మండలంలోని కార్మెల్ స్కూల్ కు చెందిన విద్యార్థిని విద్యార్థులు ప్రతిభను కనబరిచారని కార్మెల్ స్కూల్ ప్రిన్సిపాల్ లిజ్ తెలిపారు. గురువారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇండియన్ ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్ కు పాఠశాల స్థాయిలో కార్మెల్ స్కూల్లో 320 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు తెలిపారు. ఫిబ్రవరి 7న ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి టాలెంట్ పోటీలకు 32 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారని, 32 విద్యార్థిని,విద్యార్థుల్లో ఏ సహస్ర రావు, ఎం అంకిత, బి సాహితి, పి అక్షిత్ రెడ్డిలు రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబరిచారని తెలిపారు. టాలెంట్ టెస్టులో పాల్గొనేందుకు విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యార్థులను చైతన్యం చేసేందుకు కృషిచేసిన పాఠశాల ప్రిన్సిపాల్ లిజ్ బెత్ ను ఉత్తమ ప్రిన్సిపాల్ గా ఎంపిక చేసి హైదరాబాద్ చిక్కడపల్లి లో గల త్యాగరాజ గాన సభలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఉపాధ్యాయుల వల్లే ఉత్తమ ప్రిన్సిపాల్ గా రాష్ట్రస్థాయిలో గౌరవం దక్కిందని ప్రిన్సిపాల్ లిజ్ బెత్ తెలిపారు.

16న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో సీఎం పర్యటన

- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- పనులను వేగవంతం చేయాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఈనెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనపూర్ (స్టేషన్) పర్యటనకు రానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన పనులపై గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలిసి ఘనపూర్ (స్టేషన్) శాసన సభ్యులు కడియం శ్రీహరి ఆర్డీఓలు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ దాదాపు రూ.816 కోట్లతో ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గానికి వివిధకార్యాలయాలు, అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యా యని, అందుకు సంబంధించిన వాటికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకు స్థాపన కార్యక్రమం ఉంటుందన్నారు. వంద పడకల ఆసుపత్రి, యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బంజారా భవన్, సమీకత రెవెన్యూ డివిజన్ కార్యాలయ సముదాయం, విద్యుత్ సబ్ స్టేషన్, ఏడు మండలాల వారిగా ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్లు, పంచాయతీ రాజ్ శాఖద్వారా మంజూరైన రోడ్లకు, చిల్పూర్, వేలేరు మండలాల్లో ఎంపీడీఓ కార్యాలయాలకు శంకుస్థాపనలు చేయనున్నారని, ఇందుకు గాను ప్రణాళికాబద్ధంగా తగినచర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

మహిళా సాధికారత దిశగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సౌర విద్యుత్ ప్లాంట్, పెట్రోల్ బంక్ లకు శంకుస్థాపనకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఆయా పనులను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని వెల్లడించారు.అలాగే తగు జాగ్రత్తలతో అన్ని ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాలని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపిరామ్, వెంకన్న, ఏసీపీ భీం శర్మ, పీడీ డిఆర్డిఓ వసంత, డిఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డిపిఓ స్వరూప, హౌసింగ్ పీడీ మాత నాయక్, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జనగామకు సర్వాయిపాపన్న జిల్లాగా నామకరణం చేయాలి

- 21న జిల్లా కేంద్రంలో నిరాహార దీక్ష

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పుట్టిన గడ్డ జనగామ జిల్లాకు ఆయన పేరుతో నామకరణం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గౌడ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న జిల్లా కేంద్రంలో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఐలి వెంకన్న గౌడ్ తదితరులు డిమాండ్ చేశారు. జనగామ మండల కౌండిన్య పరపతి సంఘం ఆధ్వర్యంలో గురువారం గాయత్రి వేడుకల మందిరంలో సన్నాక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జనగామ గోపానాయకులు కన్నా పరశురాములు అధ్యక్షత వహించగా నారాయణ గౌడ్, వెంకన్నలు మాట్లాడుతూ దాదాపు మూడున్నర శతాబ్దాల క్రితమే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ బహుజనులను కూడగట్టుకొని గోల్కొండ నవాబులను ఎదిరించిన ధీశాలి అని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్నకు రావాల్సినంత ప్రాచుర్యం రాలేదని, ట్యాంకుబండు పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ గత శాసనసభ ఎన్నికల సమయంలో విడుదల చేసిన పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా జనగామ జిల్లాకు ఆయన నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు ఈ విషయంలో సానుకూలమైన ప్రకటనలు చేస్తున్నప్పటికీ మిగతా కులాల ప్రముఖుల పేరుతో విశ్వవిద్యాలయాలను, విమానాశ్రయాలను ఏర్పాటు చేస్తున్నారు కానీ సర్దార్ సర్వాయి పాపన్న గురించి పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేయాలని డిమాండ్ చేస్తూ గౌడ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 21న జనగామ పట్టణంలో చేపట్టే నిరాహార దీక్షలకు తెలంగాణ రాష్ట్రంలోని గౌడ కులస్తులందరూ రాజకీయాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య జనగామ మండల పరపతి సంఘం అధ్యక్షులు నామాల శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి దూడల సిద్ధయ్య గౌడ్, కోశాధికారి మెరుగు బాలరాజు గౌడ్, బిజెపి నాయకులు మార్క ఉపేందర్ గౌడ్, పెంబర్తి మాజీ సర్పంచ్ అంబాల ఆంజనేయులు గౌడ్, ఎంపీటీసీ మూల రవి గౌడ్, జర్నలిస్టులు వనమైన వెంకటేష్ గౌడ్, బత్తిని అశోక్ గౌడ్, మారగోని సిద్ధయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ విద్యా పథకం.. సంపూర్ణ విద్యాభివృద్ధికి దోహదం



నవతెలంగాణ-సుబేదారి

పీఎంశ్రీ విద్య పథకం సంపూర్ణ విద్యాభివృద్ధికి దోహదం పడుతుందని హనుమకొండ జిల్లా విద్యా శాఖ అధికారి వాసంతి తెలిపారు. పీఎం శ్రీ పథకం విద్యాభివృద్ధి కోసం తీసుకురాబడింది. ఈ స్కీము నూతన విద్యా విధానం 2020 లో భాగంగా ప్రారంభించారు. హనుమకొండ జిల్లాకు 19 స్కూల్ లను సెలెక్ట్ చేశారు. ఫేస్ 1లో 13పాఠశాలలు, ఫేస్-2 కింద 6 స్కూలు మొత్తం 19 స్కూల్ ఎంపిక చేశారు. 19 లో మూడు ప్రైమరీ స్కూళ్లు, 16 హైస్కూల్ ఉన్నాయి. పిల్లల సాంకేతిక అభివృద్ధి కోసం, విద్యార్థిని మానసిక సామర్థ్యం పెంపు కోసం తీసుకురాబడిన పథకం ఇది. మ్యాథ్స్, సైన్సు విద్యార్థికి రకరకాల ప్రత్యేకమైన రోజులలో విద్యా ప్రయోగాల ను చేయడం కోసం ఎన్నో పరికరాలు అందించబడతాయి. గ్రీనరీ పెంపొందించడం కోసం హెర్బల్ గార్డెన్ తయారు చేయడం, కిచెన్ గార్డెన్ తయారు చేయడం. నిధులు దీనికోసం సపరేటు బడ్జెట్ వస్తుంది. అటల్ టింకర్ ల్యాబ్ పథకంలో భాగంగా అటల్ టింకర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. దీనికి ఒక స్కూలుకు రూ.10 లక్షల బడ్జెట్ కేటాయించగా దీనికి జిల్లాలో 13స్కూల్ ఎంపిక చేయబడ్డాయన్నారు. దీనిలో భాగంగా ఒక లాప్‌టాప్, 75 ఇంచెస్ స్క్రీను సమకూర్చాలి. స్పేస్ కు సంబంధించిన ప్రయోగాలకు పరికరాలు ఇస్తారు. 25ట్యాబ్‌లు అందిస్తారు. అలాగే పిల్లలు అనేక చారిత్రాత్మకమైన ప్రదేశాలను సందర్శించడం కోసం ఒక్కొక్క విద్యార్థికి 500 రూపాయలు కేటాయిస్తారు. ఈ మధ్యకాలంలో హనుమకొండ జూ పార్కు, వేయిస్తంభాల గుడి ,సైన్స్ సెంటర్ ను సందర్శించడం జరిగింది. ట్విన్నింగ్ కార్యక్రమంలో హైస్కూల్ విద్యార్థులకు ఇది కేటాయించబడింది. ఈ విద్యార్థులు ఎన్ ఐటి సందర్శించి ల్యాబ్, ఇతర ప్రయోగాలకు సంబంధించిన అన్ని సందర్శించి నేర్చుకోవడం జరిగింది. దీనికి ప్రత్యేక బడ్జెట్ ఉంటుంది.

గ్రీనరీ స్కూల్ ....

గ్రీనరీ స్కూల్లో భాగంగా బడ్జెట్లో 50 వేలు అందిస్తారు. జనవరిలో ఈ బడ్జెట్ వచ్చింది. ఈ నిధులు అన్ని విద్యా సంవత్సరం మార్చి వరకు పూర్తి చేయాలి.95 శాతం నిధులను ఖర్చు చేయడం జరిగింది.

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ...

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా నాలుగేళ్లలోఒక స్కూలుకు ఒక కోటి రూపాయలు నిధులు అందిస్తారు. వాటిని ఆటవస్తులు, లైబ్రరీ లైబ్రరీకి లక్ష రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేస్తారు. విద్యార్థుల నైపుణ్యా అభివద్ధి కోసం పిఎమ్ శ్రీ పథకం : డిఈఓ వాసంతి దేశాభివద్ధిలో భాగంగా అందరూ విద్యార్థులు 2037 వరకు నైపుణ్యాలను కలిగి ఉండాలనేది లక్ష్యం పనిచేయాలి.

ప్రాథమిక పాఠశాలలో వంటశాల ప్రారంభం



నవతెలంగాణ-లింగాలఘణపురం

మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థుల ఐక్య వేదిక లింగాలగణపురం ఆధ్వర్యంలో ప్రైమరీ స్కూల్ ఆవరణలో వంటశాల ప్రారంభించిన ఆర్9 ఓవర్సీస్ హైదరాబాద్ అధినేత ప్యాట రవి పాఠశాలలో చదువుకున్న దాత ప్యాట రవి, తల్లిదండ్రులు పద్మ - బిక్షపతి రిబ్బన్ కట్ చేసి వంట గది గురువారం ప్రారంభించారు. వంట గది నిర్మాణ దాత ఆర్9 ఓవర్సీస్ అధినేత ప్యాట రవి మాట్లాడుతూ నేను చదువుకున్న స్కూల్ కు వంట గది నిర్మించడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ మార్తా , విష్ణుమూర్తి ,హై స్కూల్ హెడ్ మాస్టర్ మల్లికార్జున్, పేరెంట్ కమిటీ చైర్మన్ ప్యాట సరిత, మాజీ ఎంపీటీసీ భిక్షపతి ,నేలపోగుల మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ళ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ,మార్కెట్ కమిటీ మెంబర్ శ్రీలత రెడ్డి, మాజీ సర్పంచ్ కేమిడి సాయిమల్లయ్య, కాటమ్ విజయ్ కుమార్ ,నల్ల నర్సయ్య, చెన్నూరు మల్లేశం, రాగళ్ల ఉపేందర్, ప్యాట రాజు, మధు, ఏదునూరి వీరన్న,కుంటి రామచందర్ ,ఎదునూరి నాగరాజు ,బోయిని రమేష్, సంజీవ, కార్తీక్ , యాకన్న, వసం త్, శేఖర్, మధు,నాగరాజు, ఆనంద్, రమేష్, సత్యనారాయణ, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై రైతు ఆత్మహత్య యత్నం

- భూ సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం
- న్యాయం చేయాలని బాధిత కుటుంబం రాస్తారోకో



నవతెలంగాణ-రాయపర్తి

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కేశవు రం పరిధిలోని ఎర్ర కుంట తండాకు చెందిన వ్యక్తి భూ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆత్మహత్య యత్నం చేసిన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలో ఎర్ర కుంట గ్రామ పంచాయితీ పరిధిలోనీ భూక్యా మల్లు తన రెండు ఎకరాల భూమిలో వ్యవసాయంకై సాగునీటి కోసం బోరు వేసుకునే క్రమంలో పక్కనే భూమి ఉన్న వ్యక్తి సపావత్ డాల్యా అతని భార్య రంగమ్మ ఇద్దరు బోరుని అడ్డుకోవడంతో భూక్యా మల్లు స్థానిక పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.. వీరి ఇద్దరికి నచ్చ చెప్పి సమస్యను పరిష్కరించడానికి ఎస్ఐ శ్రావణ్ కుమార్ ప్రయత్నం చేశారు. ఇంతటికి ఎదుటి వ్యక్తి సానుకూల దక్పథానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైనా భూక్యా మల్లు పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు.

బాధ్యత వ్యక్తి పురుగుల మందు సేవించడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రవేట్ హాస్పిటకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తన తండ్రి ఆత్మహత్యకు కారకుడు తమపై ఫిర్యాదు చేసిన వ్యక్తే అని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీస్ స్టేషన్ ఎదుట వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిగా రాస్తారోకో నిర్వహించారు. భూ వివాదంలో తమకు న్యాయం జరగకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించిన విద్యార్థులు



నవతెలంగాణ-పాలకుర్తి

విద్యార్థి దశ నుండే శాస్త్ర సాంకేతిక రంగాలలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని లక్ష్యం తో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాలతో పాటు పర్యాటక కేంద్రాలను మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం సందర్శించి పరిశీలించారు. హెచ్ఎం పాయం శోభారాణి ఆధ్వర్యంలో విహార యాత్రలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, భద్రకాళి ఆలయం, లక్నవరం, వరంగల్ నీట్, ముల్కనూరుల గల మహిళ పాల ఉత్పత్తి కేంద్రాలను సందర్శించి చారిత్రాత్మక పర్యాటక కేంద్రాల గురించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి ఇంచార్జ్ ఉపాధ్యాయులు ఓరుగంటి రమేష్, అశోక్ కుమార్, రవికుమార్, వెంకటయ్య, గుగులోత్ బలరాం నాయక్, తమ్మి మధు, మరియ జత్రుత, అన్నపూర్ణ,శోభ సుమత, మెహర్ నిషా బేగం, మాలతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లయన్ శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని పడమటి కేశ్వాపూర్ పారిశుధ్య కార్మికుడు గండు కనకయ్య వినోదల కుమార్తె వివాహానికి రూ.20వేలు విలువైన పుస్తె,మట్టెలు లను లయన్ చల్లా శ్రీనివాస్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమం లో యువకులు చల్లా తిరుపతి రెడ్డి, రాజుపేట గోపాల్, వేముల మహదేవ్,తాడెం నరేందర్, గిద్దెల భాస్కర్, గిద్దెల రాజు యాచారేణి వెంకటేష్ పాల్గొన్నారు.

కేజీబీవీలో క్రీడా సామాగ్రి బహుకరణ



నవతెలంగాణ-పాలకుర్తి

కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల విద్యార్థినిలకు పాలకుర్తి ఎస్ఐ మేకల లింగారెడ్డి గురువారం 3 చెస్ బోర్డుల తో పాటు క్యారం బోర్డు లను బహుకరిం చారు. ఈ సందర్భంగా ఎస్సై లింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీలు విద్యతో పటు క్రీడల్లో ప్రతిభను కనబరిచి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఐక్యమత్యంతోపాటు శారీరకంగా, మానసికంగా దఢంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చెస్ తో పాటు క్యారంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.

క్రీడలను ప్రోత్సహించేందుకు ఎస్సై కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలకు క్రీడా సామాగ్రిని బహూకరించడం అభినందనీయమని, దాతల సహకారాన్ని విద్యార్థినీలు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారిని బైరపాక నవీన విద్యార్థినిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానేరులో మట్టిరోడ్డు తొలగించిన దుండగులు

నవతెలంగాణ-టేకుమట్ల

టేకుమట్ల మండలం కలికోట - ముత్తారం మండలం ఓడేడు గ్రామాల మధ్యలో ఉన్న మానేరు వాగులో ఉన్న మట్టి రోడ్ ను తొలగించిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్‌టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానేరు వాగులో కొంతమంది వ్యక్తులు అక్రమంగా రోడ్ నిర్మాణం చేసి టోల్ టాక్స్ వసూలు చేస్తున్న విషయం గురించి గత కొన్ని రోజులుగా వివిధ పత్రికల్లో వార్తకథనాలు వచ్చిన నేపథ్యంలో స్పందించిన అధికారులు టోల్ టాక్స్ వసూలు చేయకుండా చర్యలు తీసుకోగా, సంబంధిత వ్యక్తులు కక్ష పూరిత చర్యల్లో భాగంగా మట్టి రోడ్ ను జేసీబీ ల సహాయంతో ధ్వంసం చేయడం దారుణం, రోడ్ ధ్వంసం చేయడం మూలంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అనుమతి లేకుండా, వ్యక్తిగత స్వలాభం కోసం రోడ్ నిర్మాణం చేసి అక్రమంగా డబ్బులు వసూల్ చేసిందే కాకుండా, చట్టపరంగా అధికారులు టోల్ టాక్స్ వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటే రోడ్ ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు.

ఇకనైనా సంబందిత అధికారులు స్పందించి అక్రమంగా రోడ్ ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మంత్రి శ్రీధర్ బాబు, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు గార్లు స్పందించి మళ్ళీ రోడ్ నిర్మాణం చేసి ప్రయాణికుల బాధలు తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సీతారామచంద్రస్వామి ఆలయానికి విరాళం

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో రేకుల షెడ్డు నిర్మాణం కోసం గురువారం జలాశయ బోర్ వెల్స్ నిర్వాహకులు తోలుపు నూరి భరణి ధనరాజ్ దంపతులు ఆలయ అభివృద్ధికి 10 116 రూపాయలను ఆలయ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ ఆలయ పూజారి ముసునూరి నరేష్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మూల శ్రీనివాస్ గౌడ్. బండారు శంకర్. బూర రాజగోపాల్. మాదాసు అర్జున్. పాండవుల భద్రయ్య .మాదాసు మొగిలి. బటిక స్వామి. తదితరు లు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఏటూరు నాగారం ఇసుక క్వారీ

- ఎకో సెన్సిటివ్ పేరుతో నిలిపివేసిన అటవీశాఖ

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి సమీపాన గల మానసపల్లి శివారులో కొనసాగుతున్న ఇసుక క్వారి ప్రారంభమైన నాలుగు రోజులకే నిలిచిపోయింది. ఇసుక క్వారీ నిర్వాహకులు ఇసుకను తరలించడానికి నెల రోజుల క్రితం నుండి రోడ్లను వేసుకున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇసుక తరలింపుకు నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంలో రెవెన్యూ అటవీ మైనింగ్ శాఖలకుబాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వే బిల్లులలో ఉన్న క్వాంటిటీ కంటే ఎక్కువ ఇసుకను తరలిస్తున్న లారీలను సీజ్ చేయాలని ఆదేశాలలో పేర్కొంది. ఇసుక క్వారీ నుండి వచ్చిన ఓవర్ లోడ్ లారీలను గమనించి లారీలను సీజ్ చేయాలని లేదా ఎంత ఎక్కువ ఇసుక లారీలో ఉందో దానికి తగ్గ ఫైన్ ను ట్రెజరీకి చెల్లించే విధంగా విధానాన్ని రూపకల్పన చేసింది .నూతన విధానం అమలయ్యాక ఆయా క్వారీల నుండి వస్తున్న లారీలను పోలీస్ రెవెన్యూ శాఖ అధికారులు ఓవర్ లోడ్ లారీలను నిలిపివేస్తూ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ క్రమంలో ఈనెల మొదటి తారీకున ఏటూరునాగారం ఇసుక క్వారి ప్రారంభమైంది. రెండు రోజులు క్వారీ ఆన్లైన్లో డీడీలు తీసుకోవడానికి అనుకూలంగా ఉన్నప్పటికీ మూడు రోజుల నుండి క్వారికి సంబంధించిన వేబిల్లుల నిర్వహణ ఆన్లైన్ నుండి తొలగిపోయింది. అయితే ఈ మూడు రోజులుగా వారి యాజమాన్యం పాత వేబిలుల ప్రకారం కొనసాగించింది. రెండు రోజుల క్రితం ఏటూరు నాగారం మానసిపల్లి నుండి వెళ్తున్న లారీలను రెవెన్యూపోలీస్‌శాఖ అధికారులు గమనించి పవర్ లోడ్ తో ఉన్నాయని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అటవీ శాఖ అధికారులు జోక్యం చేసుకొని ఇసుక క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు.

ఈప్రాంతం ఫారెస్ట్‌ఏరియా పరిధిలో ఉందంటూ వారిని నిలిపివేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం క్వారీ నిలిచిపోయింది.

9 నుండి 12 వరకు సీపీఐ(ఎం) శిక్షణా తరగతులు

నవతెలంగాణ-మరిపెడ



సీపీఐ(ఎం) మహబూబాద్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు మరిపెడ మండల కేంద్రంలో మార్చి 9 నుండి 12 వరకు నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు మరిపెడ మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈతరగతులకు జిల్లా నలుమూలల నుండి 100 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈతరగతులు బోధించడానికి రాష్ట్ర నాయకులు హాజరవుతారని, ప్రజలు విజ్ఞులైన పెద్దలు ఈ తరగతుల జయప్రదానికి ఆర్థిక సహాయసహకారాలు అందించాలని కోరారు. ఈశిక్షణ తరగతులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ నిర్వహించవలసిన పాత్ర, జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు వివిధ మండలాలలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీవో పి.విజయ

నవతెలంగాణ-మరిపెడ



ఓపెన్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు 2020లో అప్పటి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎల్‌ఆర్‌ఎస్‌లో దరఖాస్తు చేసుకున్నవారు నేడు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మరిపెడ ఎంపీడీవో విజయ సూచించారు. గురువారం ఆమె మరిపెడ మండల కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మరిపెడ మండలంలో మొత్తం 647 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఉన్నాయని వాటి కోసం కార్యాలయంలో ప్రత్యేక హల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. హల్ప్ డెస్క్ నందు సీనియర్, జూనియర్ అసిస్టెంట్, ఆపరేటర్‌లు విధుల్లో ఉంటారన్నారు. మండలంలోని పురుషోత్త మయాగూడెంలో 73 దరఖాస్తులుండగా, నేడు ఎల్ ఆర్ ఎస్ సేకరణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రభుత్వ ధరలను అనుసరించి ఎల్‌ఆర్‌ఎస్ పన్ను ఉంటుందని, అనధికార లే ఆవుట్ల వివాదాలను పరిష్కరించేందుకు ఎల్ ఆర్‌ఎస్ దోహద పడుతుందన్నారు.

సమాజాన్ని మార్చే శక్తి మహిళలకే ఉంది..



- పూలే అంబేద్కర్ సభలను విజయవంతం చేయాలి
- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి

నవతెలంగాణ-మరిపెడ

ఏప్రిల్ మాసాన్ని మహనీయుల మాసంగా ప్రకటించుకొని మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సభలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామంలో కేవీపీఎస్ మహిళ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి జినక సుజాత అధ్యక్షత వహించగా దుడ్డెల రామ్మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర అనంతరం స్త్రీలకు పురుషులతో సమానంగా హోదా కల్పించే లక్ష్యంతో దేశంలో వివిధ ప్రణాళికలు భారత రాజ్యాంగంలో రూపొందించబడ్డాయని, కాని ఆచరణలో వాటిని అమలు చేయకుండా పాలకులు తుంగలో తొక్కారని రామ్మూర్తి విమర్శించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక స్త్రీ కొత్త పురోగతిని సాధిస్తున్నప్పటికీ గత కాలపు పితృస్వామ్య వ్యవస్థలో ఆధిపత్య ధోరణి నుంచి మహిళలకు పూర్తిగా విముక్తి లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసమాజంలో స్త్రీలు లేకుండా పురుషుల పురోగతి సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈసమాజాన్ని మార్చే శక్తి స్త్రీకి మాత్రమే ఉందని గుర్తు చేశారు. అయినప్పటికీ భారతదేశంలో కోటి 45 లక్షల పైగా జనాభా ఉన్న సంవత్సరానికి 5 లక్షల మంది మహిళలకుపైగా అసమానతలకు, అత్యాచారాలకు, వేధింపులకు గురవుతున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. వరకట్నపు వేధింపుల చట్టం, గృహ హింస రక్షణ చట్టం, మహిళా సాధికారత కోసం తీసుకొచ్చిన కొన్ని చట్టాలు సక్రమంగా అమలు చేయకపోవడంతో రోజుకు ఏదో ఒకచోట మహిళ బంధించి, హింసించబడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు వారికోసం తాత్కాలికంగా సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన వాటిని అమలు చేయలేని పరిస్థితుల్లో ఉందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో మహిళలు అనే టార్గెట్‌గా చేసుకొని దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. మహిళా సాధికారత కోసం, వారి హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లను మహిళలు మర్చిపోకూడదన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని మహిళలు ముందుకు వెళ్లాలని, అందుకే కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ మాసంలో మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహించాలని సంకల్పించడం జరిగిందన్నారు. మహబూబాబాద్ జిల్లాలోని అన్ని మండలాలలో సభలు సమావేశాలు నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు జిన్న లచ్చయ్య, కేవీపీఎస్ సభ్యులు నందిపాటి నవీన్, చింత వెంకటేష్, జినక సుజాత, జిన్న ఉపేంద్ర సోమయ్య, మహేశ్వరి, గంగ, జ్యోతి, తదితరులు ఉన్నారు.

శ్రామిక మహిళా హక్కుల కోసం ఉద్యమిద్దాం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి

నవతెలంగాణ-మహబూబాబాద్



అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోరాటా స్ఫూర్తితో శ్రామిక మహిళ హక్కుల కోసం ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఆఫీసులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రామిక మహిళ జిల్లా సదస్సు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ధార స్నేహబిందు అధ్యక్షతన నిర్వహించారు. ఈసదస్సుకి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాసు మాధవి మాట్లాడుతూ తమపై జరుగుతున్న దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పని గంటల తగ్గింపుకై, పని పరిస్థితుల మెరుగుకై, వేతనాల పెంపుకై, ఓటు హక్కుకై శ్రామిక మహిళా లోకం సుదీర్ఘ పోరాటాల ఫలితంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి 115 ఏండ్ల చరిత్ర ఉందని, అంతకన్నా ఎక్కువ చరిత్ర ప్రపంచ వ్యాప్తంగా మహిళల పోరాటాలకు ఉందన్నారు. తరతరాల నుండి మన సమాజంలో ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో వేళ్ళూలుకొని ఉండటం మూలాన మహిళలు అవమానాలకు, హింసకు, దాడులకు గురతున్నారని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఎంతో పురోగతిని సాధించామని, అభివృద్ధి వైపుకు దూసుకుపోతున్నామని మన పాలకులు చెప్పుకుంటున్నప్పటికీ ఆడ పిల్లలపై, మహిళలపై అత్యాచారాలు, హింసాత్మక దాడులు, ప్రేమోన్మాద హత్యలు పెరుగుతున్నాయని, పంచాయతీల పేరిట, పరువు హత్యల పేరిట, వరకట్న దురాచారాల పేరిట, గహ హింస పేరిట భారతదేశ వ్యాప్తంగా దళిత, వెనుకబడిన, ముస్లిం, మైనారిటీ, గిరిజన, ఆదివాసీ మహిళలపై అమానుషంగా దాడులూ, హింస పెచ్చరిల్లుతుందన్నారు. ప్రభుత్వాలు మహిళలభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నామని చెప్పుక తిరుగుతున్నప్పటికీ శ్రామిక మహిళలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో ప్రభుత్వం మొండిచేయి చూపెడుతుందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగం, ఆకలి, పేదరికం, ఆదాయ అసమానతలు, శ్రమదోపిడీ వల్ల శ్రామిక మహిళలు కునారిల్లిపోతున్నారు. ఒకవైపు చేద్దామంటే పని దొరకకపోవడం, పని దొరికినా తక్కువ వేతనాలు, అధిక పనిగంటలు, పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు వంటి అనేక సమస్యలు మహిళలను వెంటాడుతున్నాయన్నారు. అందుకే అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోరాట స్ఫూర్తితో సమాజంలో గౌరవంగా జీవించడం కోసం, ఉపాధికోసం, పని భద్రత కోసం, సమాన పనికి సమాన వేతనాల కోసం, ఉచిత విద్య, వైద్యం కోసం, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా మహిళా హక్కుల కోసం పురుషులను కలుపుకొని ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈసదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల రాజు కుంట ఉపేందర్ సహాయ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, ఉపాధ్యక్షులు బెస్త సంపూర్ణ, నాయకులు లలిత, సంధ్య, సలీమా, జ్యోతి, శ్రావణి, ఉమ, వీరలక్ష్మి, అనురాధ, కాంతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా నిర్మూలనకు విశేష పోరాటం..



- నాటి స్మృతులను గుర్తుచేసుకున్న ఏఐజీ ఎస్పీ నాగరాజు
- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఐజేయూ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు

నవతెలంగాణ-మరిపెడ

మానుకోట జిల్లాతో తనది ప్రత్యేక అనుబంధమని, మహబూబాబాద్ డీఎస్పీగా విధులు నిర్వహించిన కాలంలో గుడుంబా రహిత ప్రాంతంగా మార్చేందుకు పోరాటం చేశామని హైదరాబాద్ ఏఐజీ ఎస్పీ నాగరాజు గుర్తు చేసుకున్నారు. గురువారం ఆయన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తూ మార్గమధ్యంలో మరిపెడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కాసేపు బస చేశారు. గురువారం ఎస్పీ నాగరాజు జన్మదినం కావటంతో ఆయనకు టీయూడబ్ల్యూజే, ఐజేయూ మరిపెడ మండల అధ్యక్షుడు షేక్ సత్తార్ పాషా(సూర్యా స్టాఫర్), ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మొహ్మద్ రియాజ్ పాషా(ప్రజాతంత్ర) కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ నాటి విధి నిర్వహణకు సంబంధించిన జ్ఞాపకాలను జర్నలిస్టులతో పంచుకున్నారు. నెట్ వర్క్ అంతగా లేని ఆనాడు ఈప్రాంతంలోని సారాయి మహమ్మారిని తరిమేందుకు 180కి.మీ బైక్ ర్యాలీ తీసి తండాల్లో, గ్రామాల్లో ప్రజలకు చైతన్యం కల్పించినట్లు గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మానుకోటలోనే ఉంటూ ఇక్కడి ప్రజల అభ్యున్నతికి, ప్రాంతా అభివృద్ధికి కషి చేస్తానన్నారు. రానున్న కాలంలో తాను సమాజ సేవకు, ప్రజా సేవకు అంకితమవుతానని స్పష్టం చేశారు. ఎస్పీని సత్కరించిన వారిలో టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా సభ్యులు షేక్ అక్తర్ పాషా(ప్రజాజ్యోతి), యూనియన్ ప్రధాన కార్యదర్శి మచ్చ రాజేష్(ఆంధ్రప్రభ), ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శులు పోతుల గోవర్ధన్(మన తెలంగాణ), మెరుగు సంజీవ(రాజ్ న్యూస్), యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి జిన్న లచ్చయ్య(నవ తెలంగాణ), ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారు పసునూటి వేణు గోపాల్ (సాక్షి రూరల్), ప్రెస్‌క్లబ్ సభ్యులు మాలోతు తిరుపతి(సూర్య), తదితరులు పాల్గొన్నారు.

అవిశ్రాంత ఉద్యమకారుడు అల్లి శ్రీనివాస్‌రెడ్డి ఇక లేరు





- నిబద్ధత కలిగిన సీపీఐ(ఎం) నేత
- సీపీఐ(ఎం) ప్రగాఢ సానుభూతి
- నేడు మానుకోటలో అంత్యక్రియలు

నవతెలంగాణ-మహబూబాబాద్

వామపక్ష విద్యార్థి ఉద్యమాలలో ప్రస్థానం.. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో చురుకైన నేత.. కరుడుగట్టిన కమ్యూనిస్టు వాది.. సీపీఐ(ఎం) పోరాటంలో నిబద్ధత కలిగిన నాయకుడు.. నమ్మిన సిద్ధాంతం కోసం అవిశ్రాంత పోరాటం.. పుట్టింది రైతు కుటుంబంలో.. పెరిగింది కమ్యూనిస్టు భావాజాలంలో.. ఉద్యమాలు సీపీఐ(ఎం) నాయకత్వంలో.. పేదల పోరాటలే ఆయన ఊపిరిగా జీవించారు.. అణగారిన వర్గాలకు అండదండగా నిలిచారు.. పేదలకు గూడు కోసం తాపత్రయపడ్డాడు.. ఎర్రజెండా పట్టుకుని నిరంకుశ ప్రభుత్వాలకు ఎదురు నిలిచాడు.. దళిత, గిరిజన, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేశారు. కమ్యూనిటీ కార్యకర్తగా జీవితం ప్రారంభించి శాఖ కార్యదర్శిగా, పట్టణ కమిటీ సభ్యులుగా, మండల కమిటీ సభ్యులుగా, జిల్లా కమిటీ సభ్యులుగా ఎదిగారు. ప్రస్తుతం సీపీఐ(ఎం) టూ టౌన్ పట్టణ కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేస్తున్న అల్లి శ్రీనివాస్ రెడ్డి మృతి సీపీఐ(ఎం) శ్రేణులను దిగ్భ్రాంతికి గురి చేసింది. గత మూడు దశాబ్దాలకుపైగా సీపీఐ(ఎం) ఉద్యమాలలో పనిచేస్తున్నారు. నిబద్ధత కలిగిన సీపీఐ(ఎం) కార్యకర్తగా నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా ఆ పిలుపును, భావాజాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నమ్మకంగా పనిచేశారు. రెండున్నర నెలల క్రితం శ్రీనివాస్‌రెడ్డికి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మానుకోటలో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రి, యశోద హాస్పిటల్‌లో చికిత్స చేయించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఫిజియోథెరపీతో పాటు వివిధ రకాల వైద్య చికిత్సలు తీసుకుంటున్నారు. ఉన్నట్టుండి గురువారం ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. ఆయనను పరీక్షించిన వైద్యులు మూడు గంటలకు అల్లి శ్రీనివాస్‌రెడ్డి(59) మృతి చెందినట్లుగా ప్రకటించారు.

యశోద ఆసుపత్రిలో మృతి

సీపీఐ(ఎం) పార్టీ సీనియర్ నాయకులు. మహబూబాబాద్ టూ టౌన్ కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు అల్లి శ్రీనివాస్ రెడ్డి గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో యశోద హాస్పిటల్‌లో తుది శ్వాస విడిచారు. శ్రీనివాసరెడ్డి గత రెండున్నర మాసాలుగా బ్రెన్ స్ట్రోక్ వచ్చి కిమ్స్, యశోద హాస్పిటల్‌లలో వైద్యం పొందుతూ బతికించుకోవడం కోసం భార్య, కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలించలేదు. ఆయనకు అన్ని రకాల వైద్య సేవలందించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచినట్లుగా వైద్యులు ప్రకటించారు. గురువారం రాత్రి శ్రీనివాస్ రెడ్డి మృతదేహాన్ని మానుకోటలోని ఆయన స్వగృహానికి చేర్చారు.

విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు

అల్లి శ్రీనివాసరెడ్డి విద్యార్థి దశ నుంచే వామపక్ష విద్యార్థి ఉద్యమంలోనూ తదనంతరం సీపీఐ(ఎం) పార్టీ రాజకీయాలలో అనేక అనేక సంవత్సరాలుగా పనిచేశారు. తనకిచ్చిన బాధ్యతల్ని క్రమశిక్షణగల కర్తగా తన బాధ్యతలు నిర్వర్తిస్తూ పార్టీ ఎదుగుదల కోసం పనిచేశారు. ఆస్పత్రి నుంచి కోలుకుంటారని, ఇంటికి వస్తాడని పార్టీ కార్యక్రమంలో పాల్గొంటారని అందరూ ఆశించారు. శ్రీనివాస్ రెడ్డి మరణ వార్త యావత్ సీపీఐ(ఎం) పార్టీ శ్రేణులన దిగ్భ్రాంతికి గురిచేసింది

జమాండ్లపల్లి నుంచి జిల్లా కమిటీకి

మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లి గ్రామంలో అల్లి అనసూయ-పాపిరెడ్డి దంపతుల కుమారుడైన అల్లి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థి ఉద్యమాల దశ నుంచి డిగ్రీ వరకు చదువుకున్నారు. సీపీఐ(ఎం) పోరాటలకు ఆకర్షితులై పార్టీలో చేరారు. మూడు దశాబ్దాలపైగా సీపీఐ(ఎం) పోరాటంలో అవిశ్రాంతంగా పోరాడుతున్నారని, శ్రీనివాసరెడ్డి సతీమణి పద్మ మహబూబాబాద్ జడ్పీటీసీ సభ్యురాలుగా సీపీఐ(ఎం) పార్టీ తరఫున పోటీ చేశారు. సీపీఐ(ఎం) పార్టీలో కార్యకర్త నుంచి పట్టణ మండల కమిటీ సభ్యులుగా, పట్టణ కార్యదర్శిగా జిల్లా కమిటీ సభ్యులుగా ఎదిగారు. సీపీఐ(ఎం) జిల్లా పార్టీలో కీలకమైన నేతగా పనిచేస్తున్నారు. శ్రీనివాస్ రెడ్డికి భార్య పద్మ కూతురు స్ఫూర్తిలు ఉన్నారు.

సీపీఐ(ఎం)పార్టీకి తీరని లోటు

క్రమశిక్షణ కలిగిన సీపీఐ(ఎం) నేత అల్లి శ్రీనివాస్‌రెడ్డి మరణం సీపీఐ(ఎం) పార్టీకి తీరని లోటని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ కమిటీ సభ్యులు నాగయ్యలు సంతాపం ప్రకటించారు. నిబంధన, క్రమశిక్షణ కలిగిన శ్రీనివాస్‌రెడ్డి మృతి పేదల పోరాటాలకు తీరనిలోటన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, కుంట ఉపేందర్, పార్టీ పట్టణ కార్యదర్శి బాణోతు సీతారాం నాయక్‌లు సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నేడు మానుకోటలో అంత్యక్రియలు

పేదల పక్షాన అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారుడు అల్లి శ్రీనివాసరెడ్డి అంతిమయాత్ర మానుకోటలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ఆయన ఇంటి నుండి ప్రారంభం అవుతుంది. ఈఅంతిమయాత్రలో పార్టీ శ్రేణులు మొత్తం కూడా భాగస్వాములు కావాలని పార్టీ జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ తెలిపారు.



అత్యాధునిక వసతులతో విజేత ఇన్ లక్సరీ

- ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్

నవతెలంగాణ-మహబూబాబాద్

అత్యంతాదునిక వసతులతో నిర్మితమైన విజేత ఇన్ లక్సరీ సముదాయాన్ని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ బి.మురళీ నాయక్ ప్రారంభించారు. గురువారంస్థానిక బైపాస్ రోడ్డులోని చాపల రంజిత్ రెడ్డి కాంప్లెక్స్ నందు జరిగిన ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీ నాయక్ డాక్టర్ చాపల రంజిత్ రెడ్డి ముఖ్యఅతిదులుగా పాల్గొన్నారు. నిర్వాహకులు జయంత్ రెడ్డి, నందకుమార్ రెడ్డి, రాజేష్ రెడ్డిలు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్న మహబూబాబాద్ ప్రజలకు విజేత ఇన్ లక్సరీ రూమ్స్ అందుబాటులోకి రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో హైదరాబాద్ సిటీని తలపించే రీతిలో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రూమ్స్ ఉన్నాయన్నారు. ఇక్కడికి వచ్చే టూరిస్టులకు, వీఐపీలకు స్పెషల్ సూట్స్ కూడా ఉపయోగపడతాయని నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ప్రమోద్ రెడ్డి, డాక్టర్ జగన్మోహన్‌రావు, డాక్టర్ అన్నపూర్ణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంతన్ రామరాజు, గోనె శ్యామ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

- టీపీసీసీకి వినతి

నవతెలంగాణ-గార్ల:



శాసనసభ్యుల కోటాలో తనకు అవకాశం కల్పించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనియాకుల రామారావు కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు అండగా నిలిచి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కషి చేశానని అధిష్టానం నాసేవలను గుర్తించి రానున్న శాసనసభ్యుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీ అభ్యర్థిగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లకు ఇల్లందు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పులి సైదులుతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గత నలభై సంవత్సరాలుగా పార్టీ కోసం పని చేస్తున్నానని, పార్టీ ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే మరింతగా పార్టీ కోసం పని చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



జీపీలలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి

- గొడిషాల వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి.

నవతెలంగాణ-కేసముద్రంరూరల్:

కేసముద్రం మండల కేంద్రంలోని ఎంపీడీవోకి పలు డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొడిషాల వెంకన్న మాట్లాడుతూ కేసముద్రం మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు నిర్వహించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేనందువల్ల గ్రామాలలోని నిరుపేద కుటుంబాలు గ్రామీణ ఉపాధి హామీ పనులు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నూతన గ్రామపంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులు పని కల్పించి రోజువారి కూలీ రూ.600 ఇవ్వాలని, మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో కూడా ఉపాధి హామీ పనులు చేపట్టాలని పని ప్రదేశంలో కార్మికులకు ఉపాధి హామీ చట్టంలో పొందుపరిచిన సౌకర్యాలు కల్పించాలని, జాబ్ కార్డు లేని కార్మికులకు జాబ్ కార్డులు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు అకాల మరణంతో చనిపోయిన గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో చాగంటి కిషన్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ రెడ్డి మృతి పట్ల సీపీఐ(ఎం) మండల కమిటీ సంతాపం

నవతెలంగాణ-గార్ల:

సీపీఐ(ఎం) పార్టీ సీనియర్ నాయకులు మహబూబాబాద్ టూ టౌన్ కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు అల్లి శ్రీనివాస్ రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందడం విచారకరమని శ్రీనివాస్ రెడ్డి మృతి పట్ల సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందుకూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలువాల సత్యవతిలు గురువారం సంయుక్త ప్రకటన లో సంతాపం తెలిపారు. నిరంతరం పేదల సమస్యలపై పోరాటాలు నిర్వహించే శ్రీనివాస్‌రెడ్డి మృతి పార్టీ కి తీరని లోటన్నారు. నేడు 10:30 గంటలకు జిల్లా కేంద్రం లో జరిగే అంతిమ యాత్రలో మండల పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 127 మంది హాజరు

నవతెలంగాణ-గార్ల:

మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం లాంగ్వేజ్ పరీక్షకు 129 మందికి గాను 127 మంది హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరు అయినట్లు పరీక్షల డివో బి.శ్రీనివాస్, సీఎస్ ఎ.ప్రసాద్ రావులు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఎస్సై రియాజ్ పాషా పరిశీలించి పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన సదస్సు

నవతెలంగాణ-తొర్రూర్

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం నందు మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ ఆధ్వర్యంలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శాంతకుమార్, మహబూబాబాద్ డీపీఆర్‌వో రాజేందర్ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈఅవగాహన సదస్సులో మున్సిపల్ కమిషనర్ శాంత కుమార్ మాట్లాడుతూ ప్రతి ఎల్‌ఆర్‌ఎస్ బాధితుడు వారి భూములను చట్టబద్ధత ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే చక్కటి అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 2018 -2020వ సంవత్సరంలో దాదాపు 25 లక్షల మంది ఎల్ ఆర్‌ఎస్ కోసం ఆన్‌లైన్‌లో అర్జీ పెట్టుకోవడం జరిగిందని, వారి వారి భూములను ఎలాంటి వివాదాలు లేకుండా ఉండేందుకు వారు నిర్మించుకునే గృహాలకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు ఎల్‌ఆర్‌ఎస్ ఉపయోగపడుతుందని సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ, అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు 4728 దరఖాస్తులు క్లియర్ అయినాయని, లబ్ధిదారులు మున్సిపాలిటీ కార్యాలయంలో ఫీజు చెల్లించితే వెంటనే ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనికోసం మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. తొర్రూర్ మున్సిపాలిటీ పరిధిలో పదివేల300 మంది దరఖాస్తు చేసుకుంటే 4250 మంది లబ్ధిదారులు అప్రూవల్ పొందారున్నారు. అందుకే ఈ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. గ్రామాలు, పట్టణాల అభివద్ధి కోసం ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈకార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ కమిషనర్ శాంత కుమార్, మహబూబాబాద్ డీపీఆర్‌వో రాజేందర్ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రమేష్, ఎల్‌ఆర్‌ఎస్ బాధితులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యవృత్తిని సేవాభావంతో నిర్వర్తించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్

నవతెలంగాణ-తొర్రూర్



ప్రజల ఆరోగ్యాలను కాపాడే వైద్యులు రోగుల పాలిట దైవంతో సమానమని అలాంటి వైద్యం వృత్తిని సేవా భావంతో నిర్వర్తించాలని మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్ అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని తొర్రూరులో ముత్య క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అధునాతనమైన వైద్య సేవలు అందించడానికి ఈ క్లినిక్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపార ధోరణితో కాకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడే వైద్యులు నిజమైన సేవకులన్నారు. అనంతరం ముత్య క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ చందు కృష్ణ, సింధు, శ్రీనాథ్ రెడ్డిలు మాట్లాడుతూ హైదరాబాద్ లాంటి మహానగరంలో అందే అధునాతనమైన వైద్యం గ్రామీణ ప్రజలకు అందించాలని తొర్రూర్ నందు క్లినిక్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ఖర్చు మురళీకృష్ణ, స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.కిరణ్ కుమార్, డాక్టర్ సందీప్, డాక్టర్ విటల్‌కృష్ణ, క్లినిక్ ఇన్‌ఛార్జ లీగల వెంకటొరెడ్డి, బీసీఐసీ ఇన్‌ఛార్జ్ వింజమూరు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించిన పోలీసులు..

- సోషల్ మీడియాలో వైరల్

నవతెలంగాణ పెద్దవంగర:

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర పోలీస్‌స్టేషన్ లోని విశ్రాంతి గదిలో ఇద్దరు పోలీసులు మద్యం సేవించడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫిర్యాదు తీసుకోకుండా పోలీసులు మద్యం సేవించడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై ఎస్సై క్రాంతి కిరణ్‌ను వివరణ కోరగా, పోలీసులు విధులు ముగించుకుని వారు విశ్రాంతి గదిలోకి వెళ్ళారని తెలిపారు.

ఓటమిని ఒప్పుకోలేక తప్పుడు ఆరోపణలు

బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-వర్ధన్నపేట

ఉమ్మడి మెదక్-నిజామాబాద్- అదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కొందూరు మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక విఫలమయ్యారని అందుకే ఉపాధ్యాయులు, మేధావులు, పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించి ఆ పార్టీకి గట్టి బుద్ధి చెప్పారని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.

వరంగల్

మహిళా సదస్సును విజయవంతం చేయండి: టీపీటీఎఫ్

నవతెలంగాణ-మహబూబాబాద్



అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవం సందర్భంగా మార్చి 8న తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహిళా సదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధోజు కవిత పిలుపునిచ్చారు. గురువారం మహిళా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను టీపీటీఎఫ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాస్టి రమేష్, జిల్లా బాధ్యులు రాచకొండ ఉపేందర్ సీనియర్ కార్యకర్తలు సోమ విష్ణువర్ధన్, కె.గిరిజ, బి.అంజయ్య, గణపురం భిక్షపతి, సజ్జనము విద్యాసాగర్, గుండ్ల విజయ్‌కుమార్, కె.వెంకటేశ్వర్లు, తీగల రమేష్, గునిగంటి శ్రీను, వీఎండీ రఫిక్, జి.సరిరాం, బి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మ గౌరవ డప్పు మహా ప్రదర్శన

నవతెలంగాణ-సంగెం.

మండల కేంద్రంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో డప్పులతో మహా ప్రదర్శన గురువారం నిర్వహించారు. . ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు దామెర కిషోర్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ బిర్రు మహేందర్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు చాతాళ్ళ రమేష్ మాదిగలు హాజరై డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డప్పు ప్రదర్శన చేసి మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై డాక్టర్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలో ఉన్న లోటు పాట్లని సవరించి ఈ రాష్ట్రంలో 15



లక్షలు ఉన్న మాల సామాజిక వర్గానికి 5 శాతం కేటాయిస్తే 32 లక్షల కు పైగా జనాభా ఉన్న మాదిగలకు 11 శాతం కేటాయించాల్సిన అవసరం ఉన్నదన్నారు. అంతేగాక ఎస్సీ వర్గీకరణను మూడు గ్రూపులుగా కేటాయించడం వల్ల ఎస్సీ లలో ఉండే కింది స్థాయి కులాలకు సామాజిక న్యాయం జరగలేదన్నారు. అందుకని వర్గీకరణను నాలుగు ఎబీసీడీ గ్రూపులుగా కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో మాదిగలకు రెండు స్థానాలు కల్పించి సామాజిక న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు జరగబోయే క్యాబినెట్ సమావేశాల్లో ఇట్టి ప్రతిపాదనలను అమలయ్యే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కోడూరి రాజు మాదిగ, సీనియర్ నాయకులు గుండేటి లవ కుమార్, మెట్టుపల్లి ఏలియా, మాజీ ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, గుండేటి లక్ష్మీనారాయణ, బొజ్జ సురేష్ చిర్ర గణేష్ మాదిగ, ఇమ్మడి అఖిల్ మాదిగ, కొల్కనూరి రవీందర్, రవిరాజు, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్న ఎంసీపీఐ

- కేంద్ర కమిటీ సభ్యుడు సింగతి సాంబయ్య

నవతెలంగాణ-కేసముద్రంరూరల్ :

దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో బలంగా ఉండి అనేక ప్రజా ఉద్యమాలతో ఎంసీపీఐ పనిచేస్తుందని ఎంసీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు సింగతి సాంబయ్య అన్నారు. కేసముద్రం మండల కేంద్రంలో గురువారం కందుకూరి రమేష్ అధ్యక్షతన ఎంసీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు సింగతి సాంబయ్య మాట్లాడుతూ కామ్రేడ్ ఓంకార్, బీఎన్ రెడ్డి ఆశయాలను బలపరుస్తూ ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తున్నామని, రైతులపై తెచ్చిన మూడు ప్రమాదకర చట్టాలను ఉపసంహరించాలని, గత సంవత్సరం ఢిల్లీ వద్ద నిరసన దీక్ష చేపట్టామని తెలిపారు. రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించేంతవరకు ఢిల్లీలో పోరాటాలు



చేశామని తెలిపారు. అయితే ఎంసీపీఐ(యూ)లో ఉన్నవారు కొంతమంది ప్రజా ఉద్యమాలు నిర్మించలేని వారు తోటి వారిపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకపక్క ఐక్యత అంటూనే తోటి వారిపై విమర్శలు చేయడం కనీస ఇంగితజ్ఞానం లేకుండా పోలీస్ స్టేషన్‌లో ప్రచారం కోసం కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఎవరో నిర్మించిన ఆఫీసులను ఆక్రమించి రిజిస్ట్రేషన్ వారిపైనే ఉందని, అశోక్ ముఠా, రవి ముఠాలను సృష్టించి, వాటితో వచ్చే కిరాయిలు నెలకు రూ.రెండు లక్షలు తీసుకుంటూ విలాసవంతమైన జీవితాలతో ఇతరులపై బురద చల్లుతున్నారని ఆరోపించారు. మరోసారి ఎంసీపీఐ నాయకుల జోలికొస్తే మీ బండారం మొత్తం ప్రజల ముందు బట్టబయలు చేస్తామని, ఇక మీ అవినీతి, అక్రమాలను బయట పెట్టేందుకు మీవెంటే పెడతామని హెచ్చరించారు. ఈసమావేశంలో ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి పానుగంటి నర్సయ్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బానోతు లాలు, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి మరిపెల్లి మొగిలి, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షురాలు ఇరుపు ప్రియాంక, ఏఐసీటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జాటోతు బిచ్యానాయక్, ఉల్లి ప్రతాప్, దయ్యాల కుమార్, ఉల్లి రాజేశ్వరరావు, సపావత్ లింబ, జి.బాలు, సట్ల వెంకన్న, మరిపెల్లి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లిని విమర్శించడం సిగ్గు చేటు

- బీఆర్ఎస్ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు

నవతెలంగాణ-పర్వతగిరి



కాంగ్రెస్ నాయకులకు ప్రజల పట్ల, రైతుల పట్ల ఎలాంటి అవగాహన లేదని, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు విమర్శించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6 దఫాలు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచిన వ్యక్తిని ప్రజలు, రైతుల పట్ల అవగాహన లేని నాయకులు విమర్శించడం తగదని, మీ స్థాయి ఏంటో తెలుసుకొని మాట్లాడాలన్నారు. గతంలో మాజీ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే తిడుగు, నందనం, రాంనగర్, ఇల్లంద, వర్ధన్నపేట, కొత్తపల్లి, ల్యాబర్తి, కొత్తూరు, చెరువు ముందుతండా, రోళ్లకల్, రావూరు, కల్లెద రెండు,చెక్ డ్యాంలు నిర్మించిన వ్యక్తి దయాకరరావు మాత్రమేనన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే పర్వతగిరి, వర్ధన్నపేట, ఐనవోలు మండల పార్టీ అధ్యక్షులు నాయకులు బహిరంగ చర్చకు రావూరు చెక్ డ్యామ్, వర్ధన్నపేట చెక్ డ్యామ్, నందనం చెక్ డ్యామ్‌లైనా మేము సిద్ధం మీరు సిద్ధమా అని పర్వతగిరి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు సవాల్ విసిరారు. ఈకార్యక్రమంలో పర్వతగిరి మండల పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.మనోజ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు రంగుకుమార్, ఎఎంసీ మాజీ డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్‌రావు, నాయకులు నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కాశిబుగ్గ



వరంగల్ రైల్వే హమాలీ కార్మికులకు, వారి కుటుంబ సభ్యుల కోసం గురువారం కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహి ంచారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని అనురాధ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాలో కీలక పాత్ర పోషిస్తున్న హమాలీ కార్మికులు వారి పని స్వభావం కారణంగా తరచూ ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొంటారన్నారు. హమాలీ కార్మికుల ఆరోగ్యన్ని దృష్టిలో పెట్టుకొని ప్రముఖ ఎరువుల సంస్థ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఆర్ అపోలో ఎలైట్ హాస్పిటల్, కాకతీయ ఐ హాస్పిటల్ సహకారంతో సమగ్ర వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరంలో 250 మందికిపైగా హమాలీ కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందుల పంపిణీ చేయడంతో పాటు కంటి అద్దాలను అందించారు. ఈకార్యక్రమంలో డివిజనల్ హెచ్ఆర్ సుధాకర్, ఆర్ఎల్ఎం శేషు కుమార్, గాయత్రి, జోనల్ మేనేజర్ స్రుజన్ కుమార్, సుమన్, శ్రీధర్, నరేష్, హమాలీ సంఘం అధ్యక్షుడు సారయ్య, అవంతి మేనేజర్ శ్రీధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

శ్రీరంగంకు విశ్వశాంతి జాతీయ పురస్కారం ప్రధానం



నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన చిందు యక్షగాని కళ కారుడు గజవెల్లి శ్రీరంగంకు విశ్వశాంతి జాతీయ స్థాయి ఉగాది పురస్కారం అవార్డు వరించింది. 30 ఏళ్ళుగా వరంగల్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రేడియో, టీవీ, రవీంద్రభారతిలలో పలు ప్రదర్శనలిచ్చారు. అతని ప్రతిభను గుర్తించిన, ఆర్యాని సకల కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ దూడపాక శ్రీధర్, జాతీయ స్థాయి ఉగాది పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నెల 5న హైదరబాద్ రవింద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆవార్డు అందించి సత్కరించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదాలు

నవతెలంగాణ-పర్వతగిరి

వాసవీ కళ్యాణ మండపంలో గురువారం జరిగిన గొర్రెకుంట శ్రీనివాస్-పూలమ్మల కుమారుడు రఘు- కావ్య వివాహ వేడుకలకు జమాల్‌పురం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు జున్ను కనకయ్య యాదవ్ హాజరై ఆశీర్వదించారు. అలాగే జమాల్ పురం గ్రామంలో బెల్లంకొండ నాగయ్య స్వరూప ద్వితీయ పుత్రిక స్వప్న-నవీన్‌ల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు జిల్లా హరీష్, కారింగుల అరవింద్ , యూత్ అధ్యక్షులు గోదారి రాజు, జిల్లా రాజబాబు, జిల్లా సతీష్, పల్ల కొండ సమ్మయ్య, జిల్లా రాజు, తదితరులు పాల్గొన్నారు.



కోనారెడ్డి చెరువు కబ్జా.. సాగునీటిపై చెరువు కట్ట పైనే చర్చకు సిద్ధం..

- మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి

నవతెలంగాణ-వర్ధన్నపేట

ఎస్సారెస్పీ కాలువలకు సాగు నీరు అందించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ఫోన్ ద్వారా తెలపడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రిపై ఆరోపణలు చేశారు. దీంతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ నాయకులతీరుపై తీవ్రంగా విమర్శించారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎం.ఎ.ఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాజీ వర్ధన్నపేట జడ్పీటీసీ మార్గం భిక్షపతి మాట్లాడారు. వర్ధన్నపేట కోనారెడ్డి చెరువు కబ్జా చేసిన వ్యక్తులే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని వర్ధన్నపేట మాజీ జెడ్పిటిసి మార్గం భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షులు తుళ్ల కుమారస్వామిలు అన్నారు. విమర్శలు చేసే ముందు వారి స్థాయి ఏంటో తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు ఈకార్యక్రమంలో పట్టణ వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సిలువేరు కుమారస్వామి, తుమ్మల వైకయ్య,పెంచాల కుమారస్వామి, కొండేటిశ్రీను, బాణోతు శ్రీను, కంజర్ల రవి కుమార్, ఎండీ.రహీమ్, ఎండీ.అజీమ్, సోహెల్, ఎరుకొండ వేణుగోపాల్, యాకయ్య, మాజీ ఎంపీటీసీ ఉమా, వసంత్ నాయక్, భూక్యా రామన్న, అంగోతూ రాము, కొండేటి. సంపత్ పొనుగోటి చందర్ రావు, సురేష్, పూజారి.సురేష్, కందిక.సారయ్య, యతిరాజ రావులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందం

- ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య

నవతెలంగాణ-వర్ధన్నపేట

బిజెపి, టీఆర్ఎస్ పార్టీలు చీకటి రాజకీయాలతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం. సాధించిందని ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య ఆరోపించారు. గురువారం వర్ధన్నపేట మండల కేంద్రంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ గత పదేళ్ళలో బిఆర్ఎస్ చేసిన అడ్డగోలు అవినీతితో కేసీఆర్ కుటుంబం అనేక కేసులలో ఉందని, క్విడ్ ప్రో కో పద్ధతిన బిఆర్ఎస్ బీజేపీ లు వారి వారి లాభాల కోసం పని చేస్తున్నాయన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల ముందు నుంచే ఈ ఒప్పందాలు అమలు అవుతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కూడా బిఆర్ఎస్ పూర్తిగా లోపాయకారి ఒప్పందం తో బీజేపీకి మద్దతు ఇవ్వడం వల్లనే బీజేపీ 8 సీట్లు గెలిచిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బిఆర్ఎస్ 22 మంది ఆ ప్రాంతంలో ఎమ్మెల్యేలు ఉన్నా పోటీకి దూరంగా ఉండి బీజేపీని గెలిపించారన్నారు.

పూర్తిస్థాయి ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ-కొత్తగూడ




మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో గిరిజన సంక్షేమ హెచ్ డబ్ల్యూ ప్రధానోపాధ్యాయులు, ఏసీఎంల సమావేశం జరిగింది. గత నెల మీటింగ్ డిడి ఎజెండ్ సర్క్యులర్ అదేశానుసారం ఇవ్వడం జరిగింది. సమావేశం ప్రధానంగా పది ఫలితాల గురించి చర్చించి డీడీ గత నెలలో నిర్వహించిన గ్రాండ్ టెస్టులో ఫలితాలపై పాఠశాలల వారీగా పాఠశాలల వారీగా సమీక్షించారు. రాబోయే ప్రీ ఫైనల్ పరీక్షల సమయంలో అందరూ ఉదయం సాయంత్రం స్టడీ క్లాసెస్ సమర్థవంతంగా నిర్వహించి అందరూ మెరుగైన ఫలితాలు సాధించేలాగా చూడాలని డీడీ ఆదేశించారు. ఈసమావేశంలో ప్రధానోపాధ్యాయులు కె.రవీందర్ రెడ్డి, ఏటిడిఓ భాస్కర్‌రావు, ఏసీఎం రాములు , డిప్యూటీ డిఈ ఓడి సారయ్య, స్పోర్ట్స్ ఆఫీసర్ కొమ్మాలు, హెచ్‌డబ్ల్యూ ఎస్ఆర్‌పీలు పాల్గొన్నారు.

పెద్దగొల్లగా రమేష్‌యాదవ్ ఎన్నిక

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలం గుండెపూడి గ్రామ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్దగోళ్లను ఎన్నుకొన్నారు. పెద్దగొల్లగా బింగి రమేష్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెదగొల్ల బింగి రమేష్ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న యాదవ్ కుటుంబాల ప్రజలు నన్ను ఎన్నుకున్నందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. యాదవ్ కుటుంబాలకు ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకుంటున్నానని హామీ ఇచ్చారు. సారాకొల్ల గొల్లగా బింగి లింగమంతుల యాదవ్, కుల సర్పంచ్‌గా గడ్డం వెంకన్న యాదవ్, ఉప సర్పంచ్‌గా నాగినిబోయిన నరసయ్య యాదవ్, కార్యదర్శిగా నీలారపు వెంకటేశ్వర్లు యాదవ్, కోశాధికారిగా బింగి మహేష్ యాదవ్, సలహాదారులుగా బింగి లింగుస్వామి యాదవ్, గడ్డం కుమారస్వామి యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులుగా బింగి ఉపేందర్ యాదవ్, అడేపు వీరన్న యాదవ్, బింగి ప్రవీణ్ యాదవ్, మారబోయిన రమేష్ యాదవ్, మారబోయిన నాగరాజు యాదవ్ , బింగి ఉపేందర్ యాదవ్, బింగి రమేష్ యాదవ్ , బింగి గంగయ్య యాదవ్, మారాబోయిన లింగయ్య యాదవ్, బొల్లం లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





మహిళా విజేతలకు బహుమతుల ప్రధానం

నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం మహబూబాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన అభ్యర్థులకు గురువారం జిల్లా పాలనాధికారి అద్వైత్ కుమార్ సింగ్, అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ లెనిన్ వత్సల్ టోప్పో, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ కె.వీరబ్రహ్మాచారి, చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడా పోటీలలో గెలుపొందిన. నీలోఫర్, స్వరూప, సుస్మిత, అనిత, సరిత, తబాష్మ, కళ్యాణి, ప్రసన్న, అలివేలు, సంధ్యారాణి, శ్రావణి లకు బహుమతులు ప్రధానం చేశారు, అదేవిధంగా ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు మమ్మద్ రఫీ, అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ ధనమ్మ మహబూబాబాద్ జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి కొప్పు ప్రసాద్ కోశాధికారి డాక్టర్ రాజశేఖర్, పబ్లిసిటీ సెక్రటరీ పి.రాజేంద్రప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సోమ్లా నాయక్, ఉపాధ్యక్షురాలు నీలోఫర్ ఆజ్మీ, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ప్రియదర్శిని, క్రీడా పోటీలలో పాల్గొని బహుమతులు పొందారు.

ముసాయిదా బిల్లును వెనక్కి తీసుకోవాలి

నవతెలంగాణ-మహబూబాబాద్

వ్యవసాయ మార్కెట్ ముసాయిదా బిల్లును వెనక్కి తీసుకోవాలని, స్వామినాథన్ సిఫారసు అమలు చేయాలని, కనీస మద్దతు ధర చట్టం ఎంఎస్‌పీనీ పార్లమెంట్ ద్వారా చేస్తామన్న హామీని అమలు చేయాలని తదితర డిమాండ్లతో దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఎస్‌కేఎం దేశవ్యాప్త నిరసన నిరసన దీక్ష దినం పిలుపులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన దీక్ష దినం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కిసాన్ మోర్చా కమిటీ కన్వీనర్ గుజ్జు దేవేందర్ అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు జి.సత్రు, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు నెల్లూరు నాగేశ్వరరావు, ఏఐకేఎస్ ఏఐకేఎస్ రాష్ట్ర నాయకులు నల్లపు సుధాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సనప పొమ్మయ్యలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయని ఎడల దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమం తీవ్రతరం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. వివిధ సంఘాల నాయకులు గునిగంటి రాజన్న, మేక వీరన్న ఎస్‌కే బాబు భాస్కర్‌రెడ్డి చింతకుంట వెంకన్నతో పాటుగా వీరికి సంఘీభావంగా కార్మిక సంఘాల నాయకులు కామ్రేడ్ హలావత్ లింగన్న, రేష పెల్లి నవీన్ లు పాల్గొన్నారు.

నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో పరిశోధనల పాత్ర కీలకం

ప్రిన్సిపాల్ డాక్టర్ రాములు

నవతెలంగాణ-తొర్రూర్

సమస్య-పరిష్కారణ నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో పరిశోధనల పాత్ర కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాములు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తొర్రూర్ జంతుశాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులు ఈనెల 5వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖైరతాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో పాల్గొని " ఏ స్టడీ ఆన్ లెప్రసీ ఇన్ తొర్రూరు డివిజన్, మహబూబాబాద్ డిస్టిక్ ఎన్ అనాలసిస్ అండ్ అసెస్మెంట్ అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈప్రాజెక్టుకు జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శారద మార్గదర్శకత్వం వహించగా విద్యార్థులు, పి.మమత, టి. అనుష్క, పి.శ్రుతి, ఎన్.స్వాతి, పి. కృపా పాల్గొన్నారని తెలిపారు. ఈప్రాజెక్ట్ మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ డివిజన్‌లో కుష్టు వ్యాధి వ్యాప్తి, కారణాల, ప్రభావాలపై సమగ్ర అధ్యయనం చేయడం జరిగిందని తెలిపారు. జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శారదను అభినందించారు. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలను అన్వేషించడాన్ని కొనసాగించామని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈకార్యక్రమంలో అధ్యాపక బృందం వెంకటేశ్వర్లు, శాంతికుమార్, సుజాత, పార్వతి, సునీల్, శ్రీనివాస్, వాల్యానాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నిరసన

నవతెలంగాణ-గార్ల:

మూడు తరాలుగా మద్ది వంచ రైల్వే ట్రాక్ పక్కన భూములు సేద్యం చేసుకుంటున్న పేద గిరిజనుల భూములను నష్ట పరిహారం చెల్లించకుండా ధ్వంసం చేయవద్దని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జడ సత్యనారాయణ అన్నారు. రైల్వే మూడవ లైన్ నిర్మాణంలో భాగంగా రైతుల సాగు భూములను ధ్వంసం చేస్తూ బండలు, మట్టి కుప్పలు పోస్తూ వ్యవసాయానికి పనికిరాకుండా చేస్తున్నారని వారికి నష్టపరిహారం చెల్లించాలని, భూములను ధ్వంసం చేసిన చోట గురువారం ఎన్‌డీ అధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం మద్ది వంచ గ్రామంలో రెవెన్యూ అధ్వర్యంలో గ్రామసభ జరిపి భూములు నష్టపోయిన రైతులకు రూ.28 వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి నేటికీ పైసా కూడా ఇవ్వకుండా సేద్య భూములలో మిర్చి తోటలను నాశనం చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కొంతమంది బినామీ రైతులకు డబ్బులు ఇచ్చారని, పట్టాలు ఉన్న వారికి నష్ట పరిహారం చెల్లించ లేదని అనేక సార్లు అధికారాలను, జిల్లా కలెక్టర్ ను కలిసినా 18 మంది రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు గౌని మల్లేష్, మాజీ సర్పంచ్ కుసిని బాబురావు, రంగారావు, పిచ్చయ్య, శ్రీను, కృష్ణ, పోటే మియా తదితరులు పాల్గొన్నారు.

గుడిసె శ్రీనివాస్ కుటుంబానికి స్నేహితుల చేయూత

- రూ.21 వేలు ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-మరిపెడ



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన బాల్య స్నేహితుడు గుడిసె శ్రీనివాస్ ఇటీవల కాలంలో గుండెపోటుతో మరణించాడు. ఆయన మృతి బాల్య మిత్రులకు తీరని శోకం మిగిలించిందని స్నేహితులు తెలిపారు. గురువారం తన నివాసంలో వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలియజేస్తూ మా బాల్య స్నేహితులందరం ఆకుటుంబానికి ఆసరాగా నిలిచారు. రూ:21వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈకార్యక్రమంలో గండి వీరభద్రం, గండి చంద్రబాబు, గడ్డం విజయలక్ష్మి, తాళ్లపల్లి ఉమారాణి, గర్రెపల్లి కాంతారావు, ఉల్లి రవికుమార్, బానోతు హరి, లింగోజి పరిపూర్ణాచారి, సంక పద్మ, ఊర్లుగొండ రాంబాబు, నల్లమాస రవి, పి.ఉమ, గండి వెంకటేశ్వర్లు, బత్తెం రమేష్, రాగం వెంకటేశ్వర్లు, ఉల్లి శేఖర్, ఎండీ.గౌస్ పాషా, రేఖ కృష్ణమూర్తి, తాళ్లపల్లి కమలాకర్, డి.వెంకన్న, బొడ్డు అంజనేయులు, గుడిసె తీర్మల్, అర్యావత్ బాబురావు, పోల యాకయ్య, ఉర్లుగొండ అశోక్, గంట్ల గీత, కాంచనపల్లి వెంకన్న తదితరులు ఉన్నారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

అమరుల ఆశయ సాధనకై ఉద్యమిద్దాం

నవతెలంగాణ-బయ్యారం:

అమరుల ఆశయ సాధన కై ఉద్యమిద్దామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, రాష్ట్ర నాయకులు బండారు ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని బాలాజీపేట పార్టీ సీనియర్ గ్రామ కమిటీ సభ్యుడు మోదుగుల నరసయ్య సంతాప సభ గురువారం పార్టీ జిల్లా నాయకులు తోకల వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సభలో వారు మాట్లాడుతూ నరసయ్య తల్లి శాంతమ్మ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ అనేక ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నదని, శత్రువుల దాడులను అధిగమించి తప్పుడు కేసులు బనాయించినా జైలు జీవితాన్ని గడిపి ఉద్యమంలో కొనసాగుతూ నిలబడ్డారు. ఈక్రమంలో తల్లి వారసత్వంగా నరసయ్య విద్యార్థి దశ నుండి విప్లవ ఉద్యమాలకు ఆకర్షితుడై సీపీఐఎంఎల్ పార్టీలో సభ్యునిగా చేరి ఈ ప్రాంతంలో జరిగే అనేక ప్రజా పోరాటాలలో ముఖ్య భూమిక పోషించాడని కొనియాడారు. ఈసంతాప సభలో జిల్లా నాయకులు మోకాళ్ళ మురళీకృష్ణ, యాకన్న, నేతగాని రాకేష్, తుడుం వీరభద్రం, మురళీ, రమేష్, పీవోడబ్ల్యూ నాయకురాలు సింగన బోయిన సునీత తదితరులు పాల్గొన్నారు.

క్రీడ పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-కొత్తగూడ

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ వారు నిర్వహిస్తున్నటువంటి జిల్లా సెలక్షన్స్ కోసం మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కొత్తగూడ నందు గిరిజన బాలురలకు 5వ తరగతిలో మొత్తం 40 సీట్లు కలవని, 6వ తరగతిలో 6 సీట్లు కలవని 7వ తరగతిలో ఎనిమిది సీట్లు కలవని, 8వ తరగతిలో 6 సీట్లు కలవని, 9వ తరగతిలో ఐదు సీట్లు కలవని, పదవ తరగతిలో 16 సీట్లు కలవని ఇట్టి సీట్ల నిమిత్తం మార్చి 17 నుండి మార్చి 23 వరకు బ్యాటరీ టెస్టులు నిర్వహించబడునని ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు దేశీరాం నేడు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కొత్తగూడ పాకాల మరియు పీఎంఆర్‌సీ మహబూబాబాద్ నందు ఇవ్వగలరన్నారు. ఇతర ఏవైనా సందేహాలు, సమాచారం కొరకు 9492440710 9492440711 8520034964 9866644112 ఫోన్ నెంబర్ లలో సంప్రదించాలన్నారు.

నలంద విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-మహబూబాబాద్

కాకతీయ యూనివర్సిటీ 2025 కి సంబంధించి ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ ఫలితాలలో మానుకోట నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యధిక జీపీఏ మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించినట్లు చైర్మన్ నూకల రంగారెడ్డి, కరస్పాండ్ డాక్టర్ డోలి సత్యనారాయణ, డైరెక్టర్ డోలి సాధనలు తెలిపారు. డిగ్రీ ఫలితాలలో నలంద విద్యార్థులు 80 శాతం డిస్టింక్షన్ సాధించారని తెలిపారు.

విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

నవతెలంగాణ-కొత్తగూడ

మండలంలోని జడ్పీహెచ్ఎస్ పోగుల్లపల్లి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయుల తల్లిదండ్రుల సమావేశం ప్రధానోపాధ్యాయులు సీహెచ్. విష్ణువర్ధన్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా సంసిద్ధులు కావాలని దానికి గాను మంచి ఆహారం, ఆకుకూరలు, పండ్లు, పాలు తీసుకోవాలని తగినంత నిద్ర కూడా పోవాలని తెలియజేశారు. అదే విధంగా ప్రతి సబ్జెక్టులో ముఖ్యమైన అంశాలను నెమరు వేసుకొని పలుమార్లు ప్రాక్టీస్ చేయాలని విద్యార్థులకు సూచించారు. అలాగే తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు ఇంటి వద్ద ఎలాంటి పనులు చెప్పవద్దని వారి పట్ల తగిన శ్రద్ధ తీసుకొని విద్యార్థులు పరీక్షలలో మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల ఇన్‌ఛార్జ్ నెల్లుట్ల.భాస్కర్, స్టాఫ్ సెక్రటరీ వాసం .నరసయ్య, ఎస్.సుమన్, డి.సుధాకర్, ఎండి పాషామియా, ఎం.రాంబాబు, వి.మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

